వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 14 నవంబర్ 2022

## మోతాదుకు మించి బ్లాస్టింగ్ చేస్తే చర్యలు



- ప్రభాతవార్తకు స్పందించిన సీఐ, ఎస్ఐ
- బ్లాస్టింగ్ సిబ్బందికి, సైట్ ఇంజినీర్లకు హెచ్చరిక

**జమ్మలమడుగు, నవంబరు 13, ప్రభాతవార్త:**

మైలవరం మండలం వద్దిరాల వద్ద ఇష్టా రాజ్యంగా జరుపుతున్న బ్లాస్టింగ్ పనులపై అధికార యంత్రాంగం వెంటనే స్పందించి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్లకు, సైట్ ఇంజినీర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మోతాదు మించి పేలుడు పదార్థాలు వాడినా, సమీప పంట పొలాల్లోకి రాల్లు ఎగిరి పడినా చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. జీఎన్ఎస్ఎస్ వరద కాలువ విస్తరణ పనుల్లో 32వ కి.మీ రాయి సమీపంలో కాంట్రాక్టర్లు మోతాదు మించి పేలుడు పదార్థాలు వాడుతూ బ్లాస్టింగ్ చేపడుతు సమీప పొలాల్లో ఆ దాటికి రాల్లు ఎగిరి పడుతుండడంతో ప్రభాతవార్తలో వచ్చిన వార్తకు ఎస్పీ స్పందించి సీఐ, ఎస్సైలతో తనిఖీ చేయించడంతో సమీప గ్రామ ప్రజలు, రైతులు ప్రభాతవార్తకు అభినందనలు తెలిపారు.

## 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**రాజంపేట అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలో రెండు ప్రాంతాల్లో 15 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పి మేడా సుందరరావు ఆదేశాల మేరకు రిజర్వు ఇన్‌స్పెక్టర్ అలీబాషాకు చెందిన రెండు టీమ్‌లు ఎస్ఆర్ పాళెం సెక్షన్‌లోని రోళ్లమడుగు బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టా రు. ఆదివారం తెల్లవారుజామున ఒక టీమ్‌కు కుమార పెంట వద్ద కొందరు వ్యక్తులు ఎర్రదుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. వీరిని చుట్టుముట్టే లోపు దుంగలను పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో 7 ఎర్రచందనం దుంగలు లభించాయి. మరో టీమ్ చిన్నకోన అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా 8 ఎర్రచందనం దుంగలు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. పారిపోయిన వారి కోసం కూంబింగ్ తీవ్రం చేశారు. వీటి విలువ సుమారు 30 లక్షల వరకు ఉంటుందని ఎస్పి తెలిపారు.

## దిగుబడి ఆశాజనకం... ధర శూన్యం



- పురుగుపట్టి దిగుబడి తగ్గిన మొక్కజొన్న
- అప్పుల్లో కూరుకుపోయిన రైతాంగం
- ధర కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నపం

**రామసముద్రం, నవంబర్ 13 ప్రభాతవార్త :**

ప్రకృతిని నమ్ముకొని భూమిపై ఆధారపడి ఒక పంట పోతే మరో పంట వస్తుందన్న ఆశతో మొక్కజొన్న పంట దిగుబడి బాగా వచ్చినా..పంటకు గిట్టుబాటు ధర లేదు..చేసిన అప్పులు తీర్చలేక అప్పులు పాలైన రైతన్నలు..ఇలా పడమటి రైతన్నలు పంటలపై జీవనం సాగిస్తోంది. తాను జీవనం కొనసాగిస్తు వ్యవసాయ కూలీలకు ఉపాధికల్పిస్తున్నారు. ఇటీవల కత్తెరపురుగు పడి రైతుకు పంట దిగుబడి కూడా రావడంలేదని వాపోయారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటదిగుబడి రాకున్నా రబీసీజన్‌లో పంటరాక పోతుందా అనే ఆశతో కష్ట మొచ్చినా మొక్కవోని ధైర్యంతో పట్టువదలని బట్టివిక్రమార్కుడిలా జీవనయానం సాగిస్తున్న రైతాంగానికి వ్యవసాయం ఆశలజూదంగా మారింది. అయినా వ్యవసాయం మానకుండా భూమిని నమ్ముకుని జీవిస్తున్న భూమిపుత్రుడు రైతన్న, సమాజానికి రైతన్న వెన్నుముక అని, రైతుల సంక్షేమం తమ ఆశయమని నిత్యం చిలకపలుకులు పలికే పాలకవర్గాలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలం చెందుతున్నారు. ఇటీవల సాగుచేసిన మొక్కజొన్న సాగు ఆశాజనకంగా దిగుబడి వచ్చింది. గిట్టుబాటుధర లేనందున రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం లేకుండా పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమై పోతున్నామని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న అయినా లాభం చూకూర్చుతుందను కొన్న దిగుబడులు బాగా వచ్చినా ధరలు మాత్రం పెరగలేదు. ఖరీఫ్‌సీజన్‌లో సకాలంలో వర్షాలు రావడంతో రైతులు మొక్కజొన్న విరివిగా సాగుచేశారు. వర్షాలు అధికమై వేసిన పంట దెబ్బతింది. దిగుబడి రాకపోగా రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదనీ రైతులు వాపోతున్నారు. గిట్టుబాటు ధరలేక పోవడంతో మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా రైతాంగం పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న సాగు చేసేందుకు ఎకరాకు రూ.15వేల నుంచి 20వేల వరకు పెట్టుబడి ఖర్చు పెట్టారు. కౌలు రైతులు అయితే మరికాస్త పెట్టుబడి పెట్టాలి. ఎకరాకు దిగుబడి 12నుంచి 15 క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. ధరమాత్రం క్వింటా రూ.1300 ఉంది. గత ఏడాది ఎకరాకు 25క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది దిగుబడి అంతంతమాత్రం ఉండడంతో ధర కూడా పలకపోవడం విచారకరం. పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## రాజంపేట రైల్వే అండర్ బ్రిడ్జి
## భూసేకరణకు నిధులు లేవా?



- అప్రోచ్ రోడ్డు పనులు అటకెక్కాయి
- రైల్వే నిర్మాణం పూర్తయినా వృథాయే!!
- పులివెందుల రోడ్ల విస్తరణ భూసేకరణ పనులకే రూ.90 కోట్లు విడుదల
- ఇదేమి న్యాయం జగనన్నా?

**పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో రైల్వే అండర్‌బ్రిడ్జి పూర్తయినా వినియోగంలోకి రాలేదు. కేంద్రం నిధులు మంజూరై రైల్వే పనులు పూర్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలతో అప్రోచ్ రోడ్డు పనులు చేసేందుకు దిక్కు లేదు. మరో కోటి మంజూరు చేస్తే భూసేకరణ పూర్తవుతోంది. అయితే రెండింటికి దిక్కు లేదు. ఎంపి, ఎమ్మెల్యేలకు చెప్పినా పట్టించుకోవడం లేదని, అధికారపార్టీ నేతలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**రాజంపేట అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త**

రాజంపేట రైల్వేగేటును రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంతో మూసివేశారు. దీంతో వేలాది మంది విద్యార్థులకు, 20 గ్రామాల ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని మాజీ ఎంపి ఎ.సాయి ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో రైల్వే అండర్ బ్రిడ్జిని ఆయన హయాంలో మంజూరు చేశారు. వైకాపా హయాంలో పనులు మొదలు పెట్టారు. రైల్వే అండర్ బ్రిడ్జిని రైల్వేబోర్డు సుమారు కోటి రూపాయల విలువతో పూర్తి చేసింది. ఆ తర్వాత రైల్వే అండర్ బ్రిడ్జికి ఇరువైపులా ఆర్ అండ్ బి అప్రోచ్‌రోడ్డు నిర్మించాల్సి ఉంది. రాయచోటి వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేవు. రాజంపేట వైపు ప్రభుత్వ స్థలంలోనే ఆక్రమణలు వెలసి ఉన్నాయి. వారు కోర్టుకు వెళ్లడంతో అప్రోచ్ రోడ్డు పనులు పెండింగ్‌లో పడ్డాయి. భూసేకరణ పనులు పూర్తయితేనే ఆర్అండ్‌బి నిధులు కేటాయిస్తుందని ఉన్నతాధికారులు తేల్చేశారు. రాజంపేట సబ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సమయంలో వీలైనంత మేర భూసేకరణ తగ్గించి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆయన ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తయి రెండేళ్లయ్యింది. అటు ఆర్అండ్‌బి పట్టించుకోకపోవడం, ఇటు రెవెన్యూ అధికారులు భూసేకరణ చేసేందుకు చొరవ చూపక పోవడం, ఎంపి, ఎమ్మెల్యేలు కూడ దాదాపు ఇదేదారిలో వెళుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. పలుమార్లు స్థానిక నేతలు ఇద్దరు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయిన పనుల్లో చలనం లేదు. ఫలితంగా రైల్వే అండర్‌బ్రిడ్జి వరకు పూర్తయినా ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో పనికి రాకుండా పోయింది. దీనివల్ల ప్రజలకు రైల్వే పట్టాలు దాటాల్సిన దుస్థితి తప్పడం లేదు. ఇంకెంతకాలం ఇలా నిర్లక్ష్యం వ్యవహరిస్తారో చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు విద్యార్థి సంఘాలు రైల్వే అండర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాలని ఆందోళన చేపట్టేదిశగా అడుగులు వేస్తున్నాయి.

## కొత్త ఊర్లను తలపిస్తున్న జగనన్న గృహ సముదాయాలు



**రాయచోటి.నవంబర్ 13 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలో జగనన్న గృహ సముదాయాలు కొత్త ఊర్లను తలపిస్తున్నాయి. లబ్దిదారుల సొంత ఇంటి కల సాకారంతో కొందరు లబ్దిదారులు గృహ ప్రవేశాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నవరత్నాలలో భాగం గా పేదలందరికి ఇళ్ల పథకంలో నూతన గృహాల నిర్మాణం ఊపందుకుంది. జిల్లా లో 73756 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 66582 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 21 నాటికి 23880 ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా అధికారులు లక్ష్యంగా పెట్టు కున్నారు. ఇప్పటి వరకు 6778 ఇళ్లు పూర్తికాగా బిడిఎల్ 23402, బిఎల్ 21,273, ఆర్ఎల్ 6886, ఆర్‌సి 7376 వివిధ దశలలో ఉన్నాయి. మొత్తం 58937 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణానికి అవసర మయిన సామాగ్రి ఇసుక సిమెంట్, ఐరన్ అందుబాటులో లబ్దిదారులకు ఉంచారు. జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఇళ్ల నిర్మాణాల రోజువారి ప్రగతిని సమీక్షిస్తూ వారం వారం లక్ష్యాలను నిర్దేసిస్తున్నారు.

**ఒక్కొక్క ఇంటికి 1.80 లక్షలు :**

పట్టణ ప్రాంతంలో సెంటు, గ్రామీణ ప్రాంతాలలో 1.5 సెంట్లు గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి 1.80 లక్షల చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. అలాగే ఇంటికి 35 వేల చొప్పున డ్వాక్రా రుణం ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 28048 మందికి రుణాలు ఇప్పించడం జరిగింది.

**మౌళిక సదుపాయాలకు పెద్దపీట:**

జగనన్న కాలనీలలో మౌళిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి వసతికి ప్రాధాన్యత ఇస్తోంది. జగనన్న కాలనీల్లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మౌళిక వసతుల కొరకు 17.94 కోట్లు ఖర్చు చేశారు. లబ్దిదారులకు 273 కోట్లు బిల్లులు చెల్లించారు. రాయచోటి నియోజవర్గానికి 19064 ఇళ్లు మంజూరయ్యాయి. పీలేరు 10075, రాజంపేట 11930, రైల్వేకోడూరు 7187, తంబళ్లపల్లె 12552, మదనపల్లె 12948, ఇళ్లు మంజూరయ్యాయి.

## దయనీయంగా రహదారులు

- మరమ్మత్తులకు నోచుకోని వైనం
- చినుకు పడితే చిత్తడే - రోడ్లంతా జలమయం
- వార్డులో సీసీ రోడ్డు ఏర్పాటుచేయాలంటూ ప్రజల వినతి
- కూరగాయల బండ్లు, వాటర్ ట్యాంకర్లు కూడా రాని పరిస్థితి

**బద్వేలు అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త :**



బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.130 కోట్లు ప్రత్యేక నిధులతో మున్సిపాలిటీలోని 35 వార్డులలో సీసీ రోడ్లకు మంజూరు చేసిన విషయం విధితమే. అయితే మున్సిపాలిటీలో అధ్వాన్నంగా ఉన్న వార్డులలో ఒక్క వీధిలో కూడా సరిగా సీసీ రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో పలు వార్డులలోని ప్రజలు కొద్దిపాటి వర్షం పడినపుడు అక్కడ వారి పరిస్థితి వర్ణనాతీతంగా మారిందంటూ ప్రజలు వాపోతున్నారు. రూ.130 కోట్లు ప్రత్యేక నిధులతో మున్సిపాలిటీలో కొన్ని వార్డులలో మాత్రమే సీసీ రోడ్ల పనులు చేపట్టారని, మరి కొన్ని వార్డులలో సీసీ రోడ్ల పనులు మొదలుపెట్టిన దాఖలాలు కూడా లేవంటూ ఆయా వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 12వ వార్డులో గతంలో మున్సిపాలిటీ పైప్‌లైన్ కోసం తీసిన గుంతలు మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో ఆ వార్డులలోని ప్రజలు గత మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు వార్డులలో పర్యటించినపుడు అనేక సంవత్సరాల నుండి దీర్ఘకాలంగా ఉన్నటువంటి సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు నాయకుల దృష్టికి తీసుకుపోయామని, ఎన్నికలు ముగిసిన అనంతరం కొన్ని వార్డులలో మాత్రమే సీసీ రోడ్లు వేశారని, మరి కొన్ని వార్డులలో కనీసం రోడ్లపైన ఉన్న గుంతలకు మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో ప్రస్తుతం వర్షాలు పడడం వలన గుంతలలో వర్షపు నీరు ఉండడం వలన రహదారులలో వచ్చే వాహనదారులు, ప్రజలు గుంతలలో వాహనాలు పడి అనేక ప్రమాదాలకు కూడా గురవుతున్నామని వాపోతున్నారు. అలాగే పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల సంచారాన్ని అనేక దఫాలుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు పోయినా ఇంత వరకూ వాటిని బయటికి తరలించడంలో ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ చర్యలు తీసుకోలేదని పలువురు ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా శివానగర్ నుండి పూసలవాడ, మహబూబ్ నగర్, సుందరయ్య కాలని, సుమిత్రా నగర్‌తో పాటు నెల్లూరు మెయిన్ రోడ్డుకు వెళ్ళే రహదారి నిత్యం వాహనాలు రద్దీగా తీరుగుతూ ఉండడం పట్ల రహదారిలో వెళ్ళాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నామంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు 12వ వార్డులో అధ్వాన్నంగా ఉన్న సీసీ రోడ్లకు కనీసం మరమ్మత్తులైనా చేపట్టి, పందులను బయటికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**సీసీ రోడ్డుకు మరమ్మత్తులైనా చేపట్టండి :**



మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో సీసీ రోడ్లు గుంతలమయంగా మారి వర్షా కాలంలో రోడ్లపై గుంతలలో నీరంతా స్తంభించడంతో రాత్రి సమయంలో రహదారిలో రావాలంటే అనేక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఎదురవు తున్నాయి. మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు రూ.130 కోట్లు నిధులు మంజూరై నప్పటికి వార్డులో కొద్ది మేరకు కూడా పనులు చేపట్టిన దాఖలాలు లేవు. వర్షాలు పడినపుడు రాత్రి సమయంలో దుర్వాసనతో విష జ్వరాల బారిన పడి ఆసుపత్రులలో వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి కూడా నెలకొన్న సంఘటనలు శివా నగర్‌లో చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా 12వ వార్డు పై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మెన్ స్పందించి అద్వాన్నంగా ఉన్న వీధులలో సీసీ రోడ్ల పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

- సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, 12వ వార్డు వాసి.

**పందులను దూరంగా తరలించాలి**



ప్రాణాంతకరమైన వ్యాధులకు కారణమైన పందులను పట్టణం నుండి దూరంగా తరలించే విధంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు వీధిలో తిరగాలంటే పందుల భయంతో తీవ్ర భయాందోళనకు గురికావలసిన పరిస్థితి ఏర్పడింది. గతంలో పందుల దాడిలో ఇద్దరు చిన్నారు లకు తీవ్ర గాయాలయ్యాయి. శివా నగర్‌లో అనేక వీధులలో సీసీ రోడ్లు లేకపోవడంతో కాలు కింద పెట్టాలంటే కంకర రాళ్ళతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికైనా శివా నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయడంతో పాటు పందులను పట్టణానికి దూరంగా తరలించారు.

- కుంజేటి చంద్ర శేఖర్.

## మంగంపేట బెరైటీస్‌కు పెరిగిన డిమాండ్

**ఓబులవారిపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త:**



ప్రపంచ మార్కెట్‌ను శాశిస్తున్న మంగంపేట బెరైటీస్ ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఇందో సరికొత్త వ్యూహాత్మకంగా ఖనిజం ఉత్పత్తి నాణ్యత అధికంగా ఉండడంతో ఈ కనెక్షన్‌లో బిల్డర్లు పోటీ పడుతున్నారు. ఏపీఎండీసీ చరిత్రలోనే తొలిసారిగా ధరలు రికార్డు స్థాయిలో పెరగడం ఇదే ప్రథమమం. గతేడాది కంటే 60% కంటే అధిక రేట్లకు కోట్ చేసిన బిల్డర్లు ప్రభుత్వానికి ఈ ఏడాది రూ.260 కోట్లు ఆదాయం ఏటా రూ.92.5 కోట్లు ఆదాయం వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వం ప్రోత్సాహంతో రాణిస్తున్న ఖనిజాభివృద్ధి సంస్థ నాణ్యమైన ఖనిజం వెలికితీతతో ఫలితాలు సుగమం అయినట్లు తెలుస్తోంది. ఏపీలోని మంగంపేట బెరైటీస్ ఖనిజానికి అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరగడంతో పాటు మంగంపేట బెరైటీస్ ప్రపంచ మార్కెట్‌ను శాశిస్తూ మొదటి స్థానం దక్కించుకోవడం విశేషం. వీటి పట్ల ఏపీఎండీసీ ఉద్యోగులు, రాష్ట్ర ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. బెరైటీస్ ఉత్పత్తి చేస్తున్న ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఏపీఎండీసీ తాజాగా నిర్వహించిన ఈ యాక్షన్‌లో రికార్డు స్థాయిలో రేట్లు నమోదు కావడం దేశ చరిత్రలోనే ఇదే మొదటిదని పలువురు బెరైటీస్ వ్యాపారులు తెలుపుతున్నారు. క్రయ విక్రయాల ద్వారా బెరైటీస్‌కు ఏటా ఏపీఎండీసీ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.925 కోట్లు ఆదాయం వస్తున్నట్లు సమాచారం. అధిక రేట్లతో అదనంగా రూ.260 కోట్లు సమకూరుతోందని అదికారుల ద్వారా తెలుస్తోంది. బెరైటీస్ ఉత్పత్తుల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఏపీఎండీసీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలతో మరింత ముందుకు సాగుతుందని తెలుస్తోంది. అత్యంత పార దర్శకంగా విధానాలు అవలంభిస్తుండడంతో అధునాతన పద్ధతులతో నాణ్యమైన ఖనిజాన్ని వెలికి తీస్తోంది. కొన్ని నెలల క్రితం రాత్రింబవళ్లు సండే, మండే తేడాలేకుండా అధి కారులు, కార్మికులు బెరైటీస్ ఖనిజాన్ని వెలికితీయడంలో కసరత్తు చేయడం జరిగిందని చెప్పవచ్చు. కరోనా కష్ట కాలంలో కూడా బెరైటీస్ ఖనిజం ఉత్పత్తిని వెలికి తీయడంలో ఏపీఎండీసీ అధికారులు శ్రమించారని చెప్పవచ్చు. ఏపీఎండీసీ ఖనిజం క్రయ విక్రయాల కోసం ఈ కనెక్షన్ నిర్వహించింది. 15లక్షల మెట్రిక్ టన్నులు ఏ గ్రేడ్ ఖనిజం 4 లక్షల మెట్రిక్ టన్నుల బి గ్రేడ్ ఖనిజం, 25లక్షల మెట్రిక్ టన్నులు సి గ్రేడ్ ఖనిజానికి యాక్షన్ నిర్వహించింది. ఏ గ్రేడ్ ఖనిజాన్ని మెట్రిక్ టన్నుకు అత్యధికంగా రూ.6691కి బిల్డర్లు కోట్ చేశారు. గతంలో వీటి ధర రూ.4625 కాగా ఇప్పుడు రూ.2078 ఎక్కువ (మిగతా IIవ పేజీలో)

## పశువుల పాకగా అంగన్‌వాడీ కేంద్రాలు!

**ఆగిన నిర్మాణ పనులు...మట్టిలోనే బోధన ...పట్టించుకోని అధికారులు**





**వీరబల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణ పనులు పూర్తికాక మద్యలో ఆగిపోవడంతో పశువులు పాకలుగా మారుతున్నాయి. గతంలో మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు నూతనంగా నిర్మించుటకు దాదాపు ప్రతి పంచాయతీలో మంజూరు కావడం జరిగింది. అందులో కొన్ని మాత్రం పూర్తి కావడం జరిగింది. మిగతా కేంద్రాలు పూర్తి కాకుండా మద్యలో నిర్మాణం పనులు ఆగిపోయాయి. అలా ఆగి పోవడంతో ఆ గ్రామంలో ప్రజలు అంగన్‌వాడీ సెంటర్‌లో పశువులు పాకలుగా మార్చుకున్నారు. మరి కొన్ని రాత్రి వేళల్లో మద్యం ప్రియులుకు షెల్టర్‌గా మారాయి. మరి కొన్ని సెంటర్‌లలో అంగన్‌వాడీ సెంటర్‌లలో అలాగే మట్టిలో కూర్చోపెట్టి చదువు చెబుతున్నారు. వర్షం వస్తే చాలు అలాగే అక్కడే బోజనాలు వండి పెడుతున్నారు. ఇలా టీచర్‌లు పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బొంగా వాండ్లపల్లె హరిజనవాడలో పూర్తి కాని అంగన్‌వాడీ కేంద్రంలో పశువులు పాకగా మారింది. సీతంపేట అంగన్‌వాడీ కేంద్రం పూర్తి కాకపోవడంతో అలాగే మట్టిలోనే నడుపుతున్నారు.ఈ విషయాలు పలుమార్లు సంబందిత అధికారులకు తెలపుకున్నా ఫలితం లేదన్నారు. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు డబ్బులు రాలేదని తెలుపుతున్నారు. ఈ విధంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనులు పూర్తి కాకపోవడంతో పిల్లలు, టీచర్‌లు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారు లు స్పందించి పరిశీలించి కేంద్రాల పనులు పూర్తి చేసి పిల్లలకు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎన్నికేసులు పెట్టినా భయపడేది లేదు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి
- రెండు రోజులుగా పోలీసుల తీరును గమనిస్తున్నా
- అధికారపార్టీ నాయకులు, భూకబ్జాదారులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న కొందరు పోలీసులు
- టీడీపీ నాయకులపై దాడులను ఖండిస్తున్నా



వైసీపీ నాయకులు నాలుగు సెంట్ల స్థలం కోసం కొంతమంది రౌడీలతో టీడీపీ పార్లమెంట్ నగర సెక్రటరీ జమీల్, అతని తమ్ముడిపైన కట్టెలు, రాడ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీని వాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులే అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాయడం సిగ్గుచేటని తెలిపారు. పోలీసుల సమక్షంలోనే దాడులకు పాల్పడటం అమానుషమని పేర్కొన్నారు. సుబ్బారెడ్డి, రాజా మరికొంతమందిపై కేసులు పెట్టి వేధించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలో రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డిపైన అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. రమేష్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. అన్నీ గుర్తు పెట్టుకుంటాం... సరైన సమయంలో సరైన జవాబు చెబుతామని తెలిపారు. కొంతమంది పోలీసులు అత్యుత్సాహం చూపకుండా తమ పరిధిలో ఉండి విధులు నిర్వహిస్తే మంచిదని ఆయన హితవు పలికారు.

## రోడ్డు ప్రమాదంలో 6గురికి తీవ్రగాయాలు





**చిన్నమండెం, నవంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని రాయచోటి మదనపల్లె ప్రధాన రహదారిలో కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె క్రాస్‌వద్ద ఆదివారం మద్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మదన పల్లె వైపు నుంచి రాయచోటికి వెళ్తున ఏపి04ఏఆర్0580 కారు రోడ్డు దాటుచున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని అదే సమయంలో రాయచోటి వైపు నుంచి మదనపల్లె వైపు వెళుతున్న ఏపి21బికె 5346 కారును ఒకే సమయంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న చిన్నరుసుపల్లెకు చెందిన పరస రవి, అతని భార్య భాగ్యలక్ష్మి, కుమార్తెలు నాగరాణి, భవితారాణి, శ్రీవిద్యలకు తీవ్రగాయా లయ్యాయి. మదనపల్లె వైపు వెళుతున్న రాయచోటికి చెందిన మహమ్మద్‌ఖాన్ గాయపడ్డారు. వారిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిని వారిలో చిన్నరుపల్లెకు చెందిన దంపతులు, కుమార్తెలను కడపకు తరలించారు. అయితే వీరిని ఢీకొన్న కారులోని వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అందులో కూడా నలుగురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

కురబలకోట, నవంబర్ 13 ప్రభాతవార్త :



గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయమని తంబళ్ళపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కురబలకోట మండలం మట్లివారి పల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. సమస్యలపైన ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ట్రాన్స్ ఫార్మర్లు,డ్రైనేజి, పక్కాగృహాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. మట్టివారిపల్లె యూపిస్కూల్‌లో అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి దస్తగిరిసాబ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఉమాపతిరెడ్డి, ఆర్‌బికే ఛైర్మెన్ శివశంకర్, వైస్‌ఎంపిపి రమణారెడ్డి, సర్పంచ్‌లుసోమిరెడ్డి, శ్రీనివాసులు, తెట్టు మనోహర్‌రెడ్డి, ఆర్.క్రిష్టారెడ్డి, మాజి ఎంపిపి డిపి విశ్వనాథ్‌రెడ్డి, ఎంపిటిసిలు ఆనందరెడ్డి, ఎరసానుల్లా, ఆలయ ఛైర్మెన్ జగన్‌రెడ్డి, పద్మశాలి డైరెక్టర్ సురేంద్రనాథ్, ముదివేడు రాయల్స్‌బ్రదర్ అంజాద్‌ఖాన్, నాయకులు గోపిరెడ్డి, వెంకటరమణారెడ్డి, అధికారులు దిలీప్ కుమార్, అబ్దుల్ సుఖూర్, నీరజ, ద్వారకనాథ్, వెంకటేష్, వెంకటరెడ్డి మహేష్, విజయమోహన్, ముజీబ్, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైవీయూలో ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి

వైవీయూ నవంబర్ 13, ప్రభాతవార్త



యోగి వేమన విశ్వవిద్యాలయం న్యాక్ కమిటీ వస్తున్న సందర్భంగా దాదాపు 10 కోట్లు దాకా ఖర్చు చేసినట్లు సమాచారం ఇందులో 60 నుంచి 70 శాతం మాత్రమే ఖర్చుచేసి మిగిలిన డబ్బు మొత్తం అధికారులు పంచుకున్నారనీ ఆరోపిస్తూ దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వి.గంగా సురేష్ , అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి జి వల రాజు డిమాండ్ చేశారు ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్లో వారు విలేకరులతో మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయం న్యాక్ సందర్శన, పరిశీలనకు వస్తున్న సందర్భంగా రోడ్ల విస్తరణ, సుందరీకరణ , మరమ్మతులు చేయించటం, సోలార్ లైట్లు కంప్యూటర్లు, సీసీ కెమెరాలు , కుర్చీలు , కొనుగోళ్లు మార్కెట్ లో ఉన్న ధర కంటే ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేశారని గ్రీనరి పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేసి సొమ్ము చేసు కున్నారని మొత్తం అవినీతి అక్ర మాలు జరిగాయని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు వీటిపై విశ్వవిద్యాలయ అధికారులు ముఖ్యంగా రిజిస్ట్రార్ స్పందించి మొత్తం ఎంత ఖర్చు చేశారు ఏ ఏ దానికి ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలకు చెప్పాలన్నారు విశ్వవిద్యాలయంలో అధికార పార్టీ అండతో విచ్చలవిడిగా అవినీతి అక్రమాలు పాల్పడుతున్నారనీ తీవ్రంగా విమర్శించాడు. ఖర్చు చేసిన లెక్క మొత్తం విశ్వవిద్యాలయ అధికారులు మీడియా ద్వారా ప్రకటించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐ వైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, శ్రావణ్ కుమార్‌రెడ్డి, నాగార్జున, ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు శివ, కటారు శివ పాల్గొన్నారు

## భూమి పూజకు వరదరాజులరెడ్డికి ఆహ్వానం

ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలో అత్యాధునిక కూరగాయల మార్కెట్‌నిర్మాణానికి భూమి పూజ చేసి పనుల ప్రారంభ కార్య క్రమానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకుమున్సిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీ దేవి నాగరాజు, వైసీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, టౌన్ బ్యాంకు అధ్యక్షులు కుమార్ రెడ్డిలు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అత్యాధునిక నూతన కూరగాయల మార్కెట్ యాభై మూడు కోట్లతో నిర్మాణం జరుగుతోందని వివరించారు గతంలో నూతన కూరగాయల మార్కెట్ నిర్మించాలన్న మీ కలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిజం చేస్తుందని పేర్కొన్నారు కావున తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## మట్టి మజీద్ వీధిలో గ్యార్మీ వేడుకలు

ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త



పొద్దుటూరు పట్టణంలోని మట్టి మసీదువీధిలో గార్మి పండుగ సందర్భంగా దస్తమియా అండ్ సన్స్ అధినేత ఖాదర్ వలీ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి వివిఎస్ ముక్తియార్ చేతుల మీదుగా వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు అనంతరం గ్యార్మి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో షఫీ ఉల్లా, అలీ షేర్, ఖాదర్ వల్లి, అబ్దుల్ రవూఫ్, ఎస్ జిలాని భాష, ఎస్ రంతు బాషా, ఎస్ తాహిర్ హుస్సేన్, ఎస్ కరీముల్లా, మౌలా రబ్బాని, అలీఫ్, ఫరాద్, నజీర్ లు పాల్గొన్నారు.

## 22వ వార్డు ప్రజలకు హితాయత్ పిలుపు

ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలో అత్యధికంగా 53 కోట్లతో నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి ఈనెల 15న నిర్వహిస్తున్న భూమి పూజలో ప్రజలంతా పాల్గొనాలని 22వ వార్డు వైసిపి ఇన్చార్జ్ షేక్ హిదాయత్ ప్రతి ఇంటికి వెళ్లి ఆదివారం ఆహ్వాన పత్రికలు అందజేశారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రొద్దుటూరు అభివృద్ధికై 520 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని అందులో భాగంగా నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి 53కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 15న రాష్ట్ర మంత్రు లచే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వార్డు ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ కరీముల్లా వి.గౌస్, గౌస్ మొహద్దీన్, అమిర్‌భాష బ్రదర్స్, ఫిరోజ్, చంద్రబాబుల రెడ్డి, సుభాన్, సింగారి జమాల్, నూర్, రఫీ పాల్గొన్నారు

## ఆడపిల్లల్ని రక్షిద్దాం... ఆడపిల్లల్ని చదివిద్దాం

చాపాడు నవంబర్ 13, ప్రభాతవార్త



ఆడపిల్లల్ని రక్షిద్దాం, ఆడపిల్లల్ని చదివిద్దాం అని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చాపాడు కేజీవీబీ నందు బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం ప్రిన్సిపల్ నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఓ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ కేజీబీవీ లలో విద్యార్థినుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, వారి అభివృద్ధి కొరకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. బాలికలు అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాలని బాగా చదువుకొని మంచి ఉన్నత స్థానంలో ఉండాలని ఒక్క చదువులో మాత్రమే కాకుండా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఇతర ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాలని కోరారు. ప్రతి సబ్జెక్ట్ నందు మంచి మార్కులు సంపాదించడానికి ప్రయత్నం చేయాలని ఆనందంగా ఇష్ట పూర్వకంగా చదవాలని పిఓ తెలియజేశారు. పిల్లలు క్రమశిక్షణతో గురువుల పట్ల గౌరవ భావంతో మెలగాలని అప్పుడే అభివృద్ధి సాధిస్తారని బాలికలందరికీ పిఓ తెలియజేసారు. చదువు- సమాజం రెండు కళ్ళు లాగా విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి సంతకం ఒక ఆటోగ్రాఫ్ కావాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవి శంకర్, మాజీ ఉపవిద్యాశాఖ అధికారి నాగమునిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## చెన్నమ్మరాజు పల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చెన్నమ్మరాజు పల్లె గ్రామంలో వైసీపీ నాయకులు శ్రీని వాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును, ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ అనేక సంక్షేమ పథకాల ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు రైతు భరోసా విద్యా దీవెన వసతి దీవన అమ్మ ఒడిలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా తేదీల వారీగా నగదును జమ చేసిన ముఖ్యమంత్రి చరిత్రలో లేరన్నారు అలాంటి ముఖ్య మంత్రి తిరిగి ఆశీర్వదించవలసిన అవసరం మనం దరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి కాకర్ల నాగశేషారెడ్డి వరికూటి ఓబులరెడ్డి నాగాయపల్లె వెంకట రమణారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త



మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో గత నెల 29వ తేదీవరి పంట పొలానికి పురుగుమందు పిచికారి చేయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి చెందడంతో పాటు. అదే రోజు ఎస్సీ కాలనీకి చెందిన గుడి చెంచు గారి రాంబాబు అనే వ్యక్తి కమలాపురం వద్దరోడ్డు ప్రమాదంలోమృతి చెందిన సంగతి తెలిసినదే. నాటినుండి ఆయా కుటుంబాలు తమ కుటుంబ పెద్ద దిక్కును కోల్పో వడంతో. బాధాతప్త హృదయాలతో ఉన్న ఆ కుటుంబాలను ఓదార్చడంలో భాగంగా ఆదివారం మండలంలోని విశ్వనాధపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి. ప్రజా సేవకుడు. ఇరగమ్ రెడ్డి కార్తీక్ రెడ్డి. బాధిత కుటుంబాలకు ఒక్కొ క్కరికి 25వేల చొప్పున కుటుంబ సభ్యులకు అందజేసి ఓదార్చారు. ఈ సంద ర్భంగా ఆర్థికంగా చితికి పోతున్న రాంబాబు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుం టామని భరోసా ఇచ్చారు. ఈయన వెంట గ్రామ సర్పంచ్ వెంకట శివప్రసాద్. రాజేంద్రనాథ్ రెడ్డి. కార్తీక్ రెడ్డి యువసేన. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు నవంబర్ 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 26వ వార్డు వైసిపి ఇన్చార్జ్ పాలగిరి కాజా ఆధ్వర్యంలో దస్తగిరి స్వామి గ్యార్మి పండుగ సందర్భంగా నిర్వహించిన వేడుకలలో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవనం కొన సాగించాలని ఆయన అల్లాకు దువా చేశారు అనంతరం పాలగిరి ఖాజా ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ అధ్యక్షులు కుమార్ రెడ్డి డైరెక్టర్ సీతారామయ్య 26వ వార్డు వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దివ్యాంగులకు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 13, ప్రభాతవార్త:



పండ్ల వ్యాపారవేత్త అయిన ఖాదర్‌వల్లి గారి ఆధ్వర్యంలో దస్తగిరి స్వామి గార్మి పండగ సందర్భంగా ఆదివారం జెండా ఊరేగింపు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అంజుమన్ అధ్యక్షుడు వీఎస్.ముక్తియార్ చేతుల మీదుగా దివ్యాంగులకు, వృద్ధులకు, అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది. కులమతాలకతీతంగా దుప్పట్లు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సంఘం నేత దొడియి అఫ్జల్, చలపతిరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో చలి తీవ్రంగా పెరిగిపోయిందని, దోమలు కూడా విపరీతంగా పెరిగిపోయాయని వీటి వలన అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మౌలానీ, రబ్బానీ, నూరి, అరాఫత్, అతిఫ్, తైబా, అంజుమ్, అలీ షేర్, తాహిర్‌హుసేన్, షఫీ ఉల్లా, అబ్దుల్ రౌఫ్ పాల్గొన్నారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

కడప ఏడురోడ్లు, నవంబరు 13, ప్రభాతవార్త:



నగరంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే కృషి చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని నకాష్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వారు వివరించారు. 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని వీటిలో అనేక రకాల సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నా యన్నారు. నగరంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇటీవల బదిలీపై డాక్టర్ల స్థానంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను నియామకం చేపట్టి తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీల్లో ఉన్న సమస్యలు, ప్రహరీ తదితర సమస్యలు పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, షాకీర్ పాల్గొన్నారు.

## రెండవ అధికార భాష ఉర్దూ ప్రతి విద్యార్థికి చేరవేయాలి

– రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన రూట

కడప ఏడురోడ్లు, నవంబరు 13, ప్రభాతవార్త:



రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసి యేషన్ (రూట) ఆధ్వర్యంలో కడప నగరంలోని షాహీ దర్బార్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు డా.కె.అబ్దుల్ వారిస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం కాకుండా రాష్ట్ర 2వ అధికార భాష ఉర్దూకు ప్రతి విద్యార్థికి చేరవేయాలని అందుకోసం ప్రతి తెలుగు ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌరవ అతిథి రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి సహకరించాలన్నారు. రూట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ ఇమాంబాషా, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, ఎన్నికల అధికారి సయ్యద్ హిదయ తుల్లాలు మాట్లా డారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాకు రూట నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ నాయకులు అబ్దుల్‌మునాఫ్, సయ్యద్ ముస్తాక్, ఖలందర్ బాషా, అబ్దుల్ రకీబ్, షాహిదుల్లా పాల్గొన్నారు.

## కోదండరాముని సన్నిధిలో తెలంగాణా వెంకటరెడ్డి

ఒంటిమిట్ట నవంబర్13 ప్రభాతవార్త:

స్థానిక కోదండరామాలయాన్ని ఆదివారం సిపిఐ తెలంగాణ మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఆర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆలయ చరిత్ర గురించి ఆర్చకులు వివరించారు. ఆలయంలోని శిల్ప సంపద అద్భుతంగా వుందని కొనియాడారు. కార్యక్రమంలోసిపిఐ నాయకులు పాల్గోన్నారు.

## హజరత్ దస్తగిర్ సాహెబ్ జెండా ఉత్సవాలు

కడప ఏడురోడ్లు, నవంబరు 13, ప్రభాతవార్త:



నగరంలోని హోమియోపతి కాలేజీ వద్ద ఉన్న ఏఎస్ఆర్ నగర్‌లో హజరత్ దస్తగిరి సాహెబ్ జెండా ఉత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షేక్ మహబూబాషా మాట్లాడుతూ పవిత్రమైన గార్మీ షరీఫ్ మాసాన్ని పురస్క రించుకొని జెండా ఉత్స వాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా జెండా పండగ నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జెండా ఉత్సవంలో ఫకీర్ల మేళ తాళాలతో పురవీదుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు షేక్ మహ బూబ్ బాషా, షేక్ టీ బాషా, షేక్ మస్తాన్ వలీ, భక్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేపై తప్పుడు కేసులు పెట్టడం సిగ్గుచేటు

సంబేపల్లె.నవంబర్ 13 ప్రభాతవార్త



మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజక వర్గం ఇన్‌చార్జ్ రమేష్ కుమార్‌రెడ్డిని ధైర్యంగా ఎదుర్కొనే దమ్ము లేక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దళితులను అడ్డుపెట్టుకుని ఎసీ స్, ఎస్టీ అట్రాసిటి తప్పుడు కేసు నమోదు చేయించడం సిగ్గుచేటని మాజీ జెడ్పిటిసి మల్లు నరసారెడ్డి, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాజు యాదవ్, మండల టీడీపి అద్యక్షులు చిన్న రెడ్డెయ్య యాదవ్‌లు ఆరోపించారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో తేదేపా ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేకనే దళితులను ఉసిగొలిపి టీడీపి నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మల్లు విష్ణువర్దన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఖాదర్ బాష, దేవపట్ల భాస్కరెడ్డి, కోళ్లఫారం సుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి, శెట్టిపల్లె శివారెడ్డి, మాలమహానాడు సురేష్, సురేంద్ర, మదనపల్లె రాజ పాల్గొన్నారు.

## రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యంలేక అక్రమకేసులు

రాయచోటి టౌన్.నవంబర్ 13 ప్రభాతవార్త



రాజకీయంగా వైసిపి నాయకులు ఎదుర్కొనే ధైర్యం లేక రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అక్రమకేసులు బనాయించడం సిగ్గుమాలిన చర్యని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష ఆరోపించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె మండలాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి ఇద్దరు రమేష్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కేసులు ఎన్ని పెట్టినా భయపడే ప్రసక్తేలేదన్నారు. రమేష్ కుమార్‌రెడ్డిపై 323, 354, 447, 506 సెక్షన్‌ల కింద నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం పిరికిపంద చర్యన్నారు. రమేష్‌రెడ్డిపై పెట్టిన అక్రమకేసులు తొలగించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో పట్టణ అద్యక్షులు ఖాదర్‌వలి, తెలుగుదేశం పార్టీ నాయకులు కొట్టె చలపతి, అబుజార్ హుస్సేన్, మహబూబ్ అలీ, సత్యారెడ్డి, గన్‌మెన్‌రాజు, జావిద్ మైనుద్దీన్, అతావుల్లా, రెడ్డెయ్య, సాయి షణ్ముగం, ఇనాం పాల్గొన్నారు.

## 15 మంది కంటిరోగులకు ఆపరేషన్‌లు

రాయచోటి రూరల్.నవంబర్ 13 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా కేంద్రమయిన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 15 మంది కంటి రోగులకు ఆపరేషన్‌లు నిర్వహించారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, కె.వి.పల్లె, యర్రావారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులయిన 11మందికి ఆపరేషన్‌లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మందికి పరీక్షలు నిర్వ హించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మెన్ వైవి స్వరూపా గుప్త, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మెన్ చెన్నూరు అన్వర్ బాష, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, శశిబిందు, ఆప్తమాలిక్, అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటి టౌన్.నవంబర్ 13 ప్రభాతవార్త





అన్నమయ్య జిల్లాలోని సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కరించడానికి తాము శాయశక్తుల ప్రభుత్వంపై పోరాడి పరిష్కరిస్తామని నూతనంగా ఎన్నికైన సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా అద్యక్షుడు గంట నారాయణ రెడ్డి చెప్పారు. రాయచోటి పట్టణం ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన సహకార సంఘాల ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల పటిష్టం కొరకు మరియు ఉద్యోగుల భద్రత కొరకు డిసిసిబి సహకారంతో అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని ప్రతి ఉద్యోగికి హెల్త్‌కార్డ్స్ కొరకు ప్రయత్నిస్తా నన్నారు. సమావేశానికి రాయచోటి రాజంపేట, మదనపల్లె పరిధిలోని 41 సహకార సంఘాల సీఈవోలు ఉద్యోగులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గంటా నారాయణ రెడ్డి కన్వీనర్, హరినాధరెడ్డి కో కన్వీనర్ జాఫర్‌వలి, ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శి రెడ్డి బాబు కోశాధికారి వెంకటరమణ, జాయింట్ కోశాధికారిగా ఆంజనేయులు రెడ్డిను ఎన్నుకున్నారు.

## రెడ్లు ఐకమత్యంతో మెలగాలి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 13, ప్రభాతవార్త



రెడ్లు ఐకమత్యంతో ముందు కెళ్తేనే ప్రగతిని సాధించగలుగుతామని ప్రొద్దుటూరు రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగ దస్తగిరి రెడ్డి తెలిపారు. కార్తీక మాస రెడ్ల వనభోజన 8వ మహోత్సవము మైలవరం మండలం గుర్రప్పకోనలో ఆదివారం ఘనంగా జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ నాగ దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ రెడ్లందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ సేట్ గురివి రెడ్డి మాట్లాడుతూ రెడ్డి అంటేనే పదిమందికి అన్నం పెట్టేవాడని గుర్తింపు ఉందన్నారు. తాను 12 సంవత్సరాలు గుర్రప్ప దేవాలయానికి సేవలు అందించానని ప్రొద్దుటూరు పట్టణంలో గుర్రప్ప స్వామి స్థలంలో కళ్యాణమండపం కట్టి గుర్రప్ప స్వామి సేవలు కొనసాగిస్తామని చెప్పారు. రెడ్లందరూ చేతనైతే సేవ చేయాలే తప్ప ఒకరికి అని కలిగించరాదు అన్నారు. శివాలయం ఛైర్మన్ శెట్టిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్తోమత కలిగిన రెడ్ల అందరూ కనీసం పదిమందికి సహాయం చేయాలని, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్లు అందించాలని కోరారు. శివశక్తి పుల్లారెడ్డి మాట్లాడుతూ లవ్ జిహాదీ పేరుతో రెడ్డి సామాజిక వర్గ మహిళలను టార్గెట్ చేస్తూ తమ మత అవసరాలకు వాడుకుంటున్నారని ఈ విషయంలో జాగ్రత్త పడాలని రెడ్లకు హితావు పలికారు. ఈ కార్యక్రమంలో మహిళలచే కోలాటం, భజనలు కనువిందు చేశాయి. అనంతరం వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి గంగిరెడ్డి, రెడ్డి సేవా సమితి కడప ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ఆర్టిపిపి కాంట్రాక్టర్ బివి సుబ్బారెడ్డి, అడిషనల్ సెక్రటరీ కేతు బాలిరెడ్డి, కార్యక్రమం నిర్వాకుడు ఒంటెద్దు సుధాకర్ రెడ్డి, సభ్యుడు సంజీవరెడ్డి, అడ్వకేట్ ముని సుబ్బారెడ్డి, రెడ్డి సేవా సంఘం సభ్యులు, రెడ్ల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆహ్లాదకర వాతావరణంలో మృకుండ మల్లేశ్వరస్వామి

### నేడు మూడవ కార్తీక సోమవారం

ఒంటిమిట్ట నవంబర్13ప్రభాతవార్త:





పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీమృకుండ మల్లేశ్వరస్వామి భక్తుల రోగాలు నయం చేయడమే కాకుండావారి కోర్కెలు దీర్చే దైవంగా నిత్య ం పూజలందుకుంటున్నారు. ఏకశిలానగరమనే పేరున్న ఒంటిమిట్టకు రెండు కిలోమీటర్ల దూరంలో కడప-చెన్నైప్రదాన రహదారిలో రైల్వే ట్రాక్ వద్ద ఈ మృకుండాశ్రమంఉంది. అతి పురాతనమైన ఈ శివాలయ ం ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందింది.ఎంతో ప్రాచీన చరిత్ర గల ఈ ఆలయాన్నికొన్ని దశాబ్దాల క్రిత ం నిర్మించినట్లు తెలుస్తోంది. అప్పట్లో విజయనగర రాజుల పరిపాలనలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం విశాలమైన స్థలంలో వెలసిన శ్రీమృకుండామల్లేశ్వర స్వామిని దర్శించుకుంటే సర్వ రోగాలు కూడా నయమవుతాయని ఈ ప్రాంత వాసుల విశ్వాసం.

**ఆలయ చరిత్ర:** విదాతకుమారుడైన శ్రీ మృకుండామహిర్షి ఆయన బార్య మనస్వినికు మార్కొండేయుడు అనే కుమారుడు జన్మించారు. మార్కొండేయుడు అల్పాయుష్కకు దవుతాడనే వరంతో జన్మించారు. అయితే మార్కొండేయుడు అల్పాయుష్కడు దగ్గర పడుతుండంతో తట్టుకోలేని తండ్రి మృకుండ మహర్షి కుమారుని దీర్ఘాయుష్కుడిని చేయడం కోసం ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్టించి తపస్సు చేశాడని చెబుతారు. ఆందువల్లే ఈ ఆలయానికి మృకుండాశ్రమం అనే పేరు వచ్చిందంటారు.

**ఘనంగా కార్తీక మాసోత్సవాలు:**

శ్రీమృకుండామల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏటా కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్య ంగాకార్తీకాలోనిమూడవ సోమవారంఈ ఆలయం భక్తులతో నిండిపోతుంది. ఈ ప్రాంతంలోని వారే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన మృకుండాశ్రమం ఆలయాన్ని ఆబివృద్ధి చేయడంలో దేవాదాయ శాఖ విఫలమైందని చెప్పవచ్చు. ఎన్నో సంవత్సరాలనుంచి ఆలయం ఆభివృద్ధి గురించి ఆదికారులు పట్టించుకోలేదు. భక్తులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. ఆదికారులు స్పందించి భక్తులు ఆలయంలోనికి వెళ్ళేం దుకు ఓవర్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం వుంది. ఆలయానికి ఉత్తరబాగాన ఆక్కదేవతల గృహ వుంది. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు చాలా మంది ఈ గృహలను సందర్శించి వెళుతుంటారు. కార్తీక మాసంతో ఆలయంలో భక్తులు ఆన్నదాన, భజనలు, హరికధ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## లివర్ మార్పిడిలో విజయవంతం

కడప కార్పొరేషన్, నవంబరు 13, ప్రభాతవార్త:



లివర్ సమస్యలు ఉన్న వారికి విజయవంతంగా లివర్ మార్పిడి చేసినట్లు గ్లెనిగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ డైరెక్టర్ డా.మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఓడీ కార్పొరేట్ రిలేషన్స్ వి.భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. భారతదేశంలోనే లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్, లివర్, ప్యాంక్రియాస్ వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక స్థానిక దినేష్ ఆసుపత్రిలో పాత్రికేయుల సమా వేశంలో వారు మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ లివర్ క్లినిక్‌ను డా.దినేష్ హాస్పిటల్‌లో ప్రతి నెలా చివరి శనివారం నిర్వహిస్తామని చెప్పారు. లివర్ సమస్యలకు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. కార్పొరేటర్ షఫీ మాట్లాడుతూ లివర్ వ్యాధి బారిన పడిన రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో డా.దినేష్‌రెడ్డి, వైసీపీ నేతలు ఐస్‌క్రీం రవి, కార్పొరేటర్ షఫీ, లివర్ వ్యాధి బాధితులు ఆయేషా, ఉదయగిరి, ఇమాంబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అయ్యప్ప స్వామి పడి పూజ

కాశినాయన, నవంబరు 13 ప్రభాతవార్త :



కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం మండలంలోని బసనపల్లె గ్రామంలో అయ్యప్ప స్వామి పూడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా అయ్యప్ప భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ళ మండలం నుండి పలువురు గురుస్వాములు, అయ్యప్ప స్వామి భక్తులు, చుట్టుప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో అయ్యప్ప స్వామి భక్తులు పడిపూజలో పాల్గొని అయ్యప్ప శరణు ఘోష అంటూ తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం గురుస్వాములు మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో అయ్యప్ప స్వామి మాలాదరణ చేసి 41 రోజుల పాటు నియమ నిష్ఠలతో అయ్యప్ప స్వామి పూజలు నిర్వహిస్తూ స్వామివారిని స్మరించుకుంటూ శబరిమలైలో వెలసిన శ్రీ హరిహర సుతన్ అయ్యప్ప స్వామికి ఇరుముడి చెల్లించుకోవడం వలన స్వామివారి అనుగ్రహంతో అనేక శుభ పరిణామాలు సిద్ధిస్తాయన్నారు. అనంతరం పలువురు అయ్యప్ప స్వామి భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారికి కాయా కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు. అయ్యప్ప స్వామి భక్తుల వద్ద పలువురు భక్తులు భిక్ష పెట్టించుకొని స్వామివారి ప్రసాదాన్ని పలువురు భక్తులు స్వీకరించారు.

## కమ్మ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి

– దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు

కడప కార్పొరేషన్, నవంబరు 13, ప్రభాతవార్త:

కమ్మ సంక్షేమ సంఘం అభివృద్ధికి పాటుపడతానని ఆ సంఘం అధ్యక్షులు దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు పేర్కొ న్నారు. అసంపూర్తిగా ఉన్న బిల్డింగ్‌ను పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. ఆది వారం కడప నగరంలోని స్థానిక కమ్మ సంక్షేమ సంఘం కార్యాలయంలో కడప జిల్లా కమ్మ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడును ఎన్నుకున్నారు. వారం రోజుల్లో మిగిలిన బాడీని ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ కమ్మ కులస్థులు విద్యాపరంగా, ఆర్థికంగా, వైద్య పరంగా ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తెస్తే వెంటనే స్పందించి తగు ఏర్పాట్లు చేస్తానని తెలిఎపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు నాయుడు, జి.తిరుమల నాయుడు, కిశోర్, చౌదరి, హరి నాయుడు, వెంకట రమణ నాయుడు, సుబ్బరాయుడు, సురేంద్రబాబు, కమ్మ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మంగంపేట బెరైటీస్‌కు పెరిగిన డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

రేట్లు పలకడంతో టన్ను బి గ్రేడ్ ఖనిజం రూ.5300 చేరుకుంది. బి గ్రేడ్ ప్రస్తుతం రూ.1878 ధరలు ఎక్కువగా లభించింది. సీ మరియు డీ గ్రేడ్ ఖనిజం ధరల్లోనూ అధికంగా నమోదయ్యాయి. ప్రపంచంలోనే అత్యధికంగా బెరైటీస్‌ను ఉత్పత్తి చేస్తున్న ఏపీఎండీసీ సంస్థ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతా ప్రమాణాలతో నాణ్యమైన ఏ గ్రేడ్ ఖనిజాన్ని వెలికి తీసి అంతర్జాతీయంగా గుర్తింపు పొందడం పటిష్టమైన మార్కెట్ వ్యవస్త సమర్థవంతమైన మైనింగ్ ఆపరేషన్ను సొంతం చేసుకొని గతేడాది నుంచి నేటి వరకు రాయలసీమలో భారీ వర్షాలు కురిసి నప్పటికీ ఉత్పత్తి ఏమాత్రం ఆటంకాలు ఎదురైనప్పటికీ రికార్డు స్థాయిలో అధికంగా టార్గెట్‌కు తగ్గట్టు బెరైటీస్ ఉత్పత్తిని పెంచిందని పలువురు ఏపీఎండీసీ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, నాయకులు ఏపీఎండీసీ అధికారులు అన్ని విధాలా ఉత్పత్తిని పెంచుతున్నారని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఖనిజం ఖాళీ కాబోతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రనక.. పగలనక.. సండే మండే రోజులు తేడా లేకుండా బెరైటీస్ ఉత్పత్తిని వెలికి తీయడంతో ఇంకెన్నాళ్లు ఖనిజం ఉంటుందని పలువురు ఉద్యోగులు యంత్రాల నుంచి ఉపాధి పొందుతున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పంజం సుకుమార్‌రెడ్డికి పితృవియోగం

## నివాళులర్పించిన అతిరథ మహారథులు



రైల్వేకోడూరు రూరల్, నవంబరు 13 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రైతు సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తండ్రి, మాజీ వివి పంజం శంకర్‌రెడ్డి గత రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన మరణవార్త తెలియగానే రైల్వేకోడూరు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, ఎపిఎండిసి ఛైర్మన్ వెంకటరెడ్డి, క్లాస్-1 కాంట్రాక్టర్ చియ్యవరం వేణుగోపాల్‌రెడ్డితో పాటు సిపిఐ వెంకటరమణ, ముఖ్యమంత్రి సలహాదారు రక్కాసి ధనుంజయ్యరెడ్డి, వైసిపికి చెందిన అతిరథ మహారథులు ఆయనకు ఘన నివాళులర్పించారు. మృతుడు శంకర్‌రెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మాజీ సర్పంచ్ పంజం వేణుగోపాల్‌రెడ్డి, రెండో కుమారుడు జిల్లా వ్యవసాయ రైతు సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డిలు ఉన్నారు. వృత్తిలో చక్కటి మృధుస్వభావి శంకర్‌రెడ్డి. వృత్తినే దైవంగా భావించి ఉద్యోగంలో మంచి నేర్పరిగా ఉన్నత స్థాయికి శంకర్‌రెడ్డి ఎదిగారు.

**తెలుగుదేశంపార్టీ నాయకుల ఆధ్వర్యంలో...**

పంజం సుకుమార్‌రెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి మృతిచెందిన విషయాన్ని తెలుసుకొన్న రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ నాయకులు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్ సంతాపం తెలిపారు. పూలమాలతో శంకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

# కార్మికులకు కనీస వేతన చెల్లించాలి

రాజంపేట అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త



వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల్లో పనిచేస్తున్నవారికి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం రాజంపేట ఏరియా ఎఐటియుసి కమిటి సమావేశం పట్టణ కార్యదర్శి సికిందర్ అధ్యక్షతన జరిగింది. అరకొర వేతనాలు అమలు చేసి వెట్టిచాకిరి చేయించుకొంటున్నారని పేర్కొన్నారు. అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, స్కీమ్ కార్మికులకు కనీస వేతన 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో, హమాలి కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎస్ రాయుడు, ఎపి అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కోకన్వీనర్ సరోజమ్మ, నాగేశ్వరరావు, రమేష్, యాదమ్మ, రాజు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# యర్రకాల్వ ప్రభావతమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యేలు

సంబేపల్లె.నవంబర్ 13 ప్రభాతవార్త



సంబేపల్లె మండల గురి గింజకుంట యర్రకాల్వపల్లె లో ఆదివారం జరిగిన స ర్పంచ్ రఘునాధరెడ్డి సతీమణి యర్రకాల్వ ప్రభావత మ్మ దశ దిన ఖర్మకాండలో ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, మేడా మల్లిఖార్జున రెడ్డిలు పాల్గొన్నారు. ప్రభావతమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకాంక్షించారు. మజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, బీసి నాయకుడు పల్లపు రమేష్, విఆర్ విద్యాసంస్థల అధినేత విఆర్ రెడ్డి, అన్నారెడ్డి, ఏజిపి రమేష్‌రెడ్డి, కాకులపల్లె రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ద్వారకనాథరెడ్డి, కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లిఖార్జున, ఎంపిటిసి శివయ్య తదితరుల శ్రద్ధాంజలి ఘటించారు.

# లోకేష్‌ను కలిసిన రాజంపేట తెలుగుయువత నాయకులు

రామాపురం.నవంబర్ 13 ప్రభాతవార్త



తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని తన నివాసంలో ఆదివారం రా జంపేట తెలుగుయువత కార్యదర్శి బాలశెట్టి రాజేష్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లా డుతూ రాబోవు ఎన్నికలలో పార్టీ గెలుపుకోసం యువత కృషి చేయాలని రాయచోటి నియోకవర్గ పరిధిలోని తెలుగుయువతను బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. లోకేష్‌ను కలిసిన వారిలో రాయచోటి అసెంబ్లీ తెలుగుయువత అధ్యక్షులు జాబీర్, సంబేపల్లె మండల తెలుగుయువత అధ్యక్షులు హరియాదవ్, రామాపురం మండల తెలుగు యువత అధ్యక్షులు బండారి వెంకటేష్, రాజంపేట సోసియల్ మీడియా కోఆర్డినేటర్ చింతా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

# నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తంబళ్లపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త:

నవంబరు 14 నుంచి తంబళ్లపల్లె శాఖ గ్రంథాలయ వారోత్స వాలు ప్రారంభమవుతాయని గ్రంథాలయ అధికారి జిలానీ బాషా విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్స వాలు జరుపుతామని ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వకృత్వ, క్విజ్ పోటీలు, సామాజిక స్వీయ పఠనం జరిపి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొంటారని వారోత్స వాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మాజీ సర్పంచి నారాయణమ్మ మృతి



తంబళ్లపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం మర్రిమాకులపల్లి మాజీ సర్పంచ్ నారాయణమ్మ ఆదివారం ఆకస్మిక మృతి చెందారు. ఆమె సర్పంచిగా గతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు సంపాదించుకున్నారు. ఆమె పనితీరును మెచ్చిన నేటి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆమెకు మల్లయ్య కొండ దేవాదాయశాఖ కమిటీ వమెంబరుగా ఎంపిక చేశారు. ఆమె మృతిపై ప్రస్తుత సర్పంచ్ జ్యోతి, మాజీ సర్పంచ్ కేఆర్ మల్‌రెడ్డి, వైకాపా మండల అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, ఎంపీపీ అనసూయ, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, ములకల చెరువు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజనీ సురేంద్ర, సింగిల్ విండో ఛైర్మన్ భార్గవ్‌రెడ్డి, సర్పంచులు శ్యామలమ్మ, అలీ అహ్మద్, మౌలాలి, తాళ్ల చంద్రశేఖర్, వవీరభద్ర, చిన్న రాయుడు, ఎంపీటీసీలు పద్మనాభరెడ్డి, కోటిరెడ్డి సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఛర్మవ్యాధులకు వైద్య సేవలు



కడప కార్పొరేషన్, నవంబరు 13, ప్రభాతవార్త:

ఛర్మవ్యాధులకు సంబంధించిన అన్ని రకాల వైద్య చికిత్సలను అందిస్తామని ఆర్య న్యూరో డెంటల్ నిర్వాహకురాలు డా.జి.దివ్యశ్రీ పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముఖానికి సంబంధించిన లేజర్ మచ్చలకు చికిత్స అందిస్తామని తెలిపారు. ఛర్మ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులను నయం చేస్తామని పేర్కొన్నారు. తలకు జుట్టు రాలడం వంటి సమస్యలను నివారిస్తామన్నారు. బాడీలోని అధిక శాతం నిల్వ ఉన్న కొవ్వు పదార్థాలను తగ్గిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల సుబ్బారెడ్డి, కిరణ్, గోవింద, నాగరాజు పాల్గొన్నారు.

## ఘనంగా పాన్ ఇండియా క్యాంపెయిన్ కార్యక్రమాలు

కడప లీగల్, నవంబరు 13, ప్రభాతవార్త:

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ ఆదేశానుసారంగా ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి సూచనల మేరకు స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సందర్భంగా అక్టోబరు 31 నుంచి ఈనెల 13 వరకు పాన్ ఇండియా క్యాంపెయిన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి ఎస్.కవిత తెలిపారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటరీలతో జిల్లా కోర్టు ఆవరణం నుంచి ఏపీఎస్ఆర్టీసీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. మరో ర్యాలీ ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం నెంబరు-2 నుంచి మరియాపురం సర్కిల్ వరకు నిర్వహించడం జరిగిందన్నారు.ర్యాలీలో విద్యార్థులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రమేష్ రెడ్డిపై అక్రమకేసులు ఎత్తివేయాలి

గాలివీడు.నవంబర్ 13 ప్రభాతవార్త



మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తి వేయాలని మాజీ ఎంపిపి వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో మండల టీడీపి నాయకులు సమావేశమై రమేష్‌రెడ్డి పై పెట్టిన కేసులును వారు మూకుమ్మడిగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ ఆర్ కుటుంబ అజాత శత్రువులుగా పేరుగాంచారని అలాంటి వారిపై నిందారోపణలు చేయడం సరికాదన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే సొంతభూములను మైనార్టీ మసీదుకు అందజేసింది జగమెరిగిన సత్యమేన న్నారు. వెంటనే అధికారులు విచారించి అక్రమకేసులును తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారధి రెడ్డి మాజీ మార్కెట్ కమిటి ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ సర ంపచ్ లు మహమ్మద్ రియాజ్, చిన్నపరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భద్రప్పనాయుడు, టీడీపి నాయకులు, డాక్టర్ రామచద్రారెడ్డి, మిటేనాయక్, మహబూబ్ బాష, వీరరాఘ వులు, అనిల్‌రెడ్డి, రామాంజులు రెడ్డి, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

**రామాపురంలో...**



రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి. ఆయనను ఎదుర్కోలేక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు బనాయించడం నీతి మాలిన చర్య అని అన్నమయ్య జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొవ్వూరి దివ్యకుమార్‌రెడ్డి మండల టీడీపి సీనియర్ నాయకుడు కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కొండా వాండ్లపల్లెలో ఆయన స్వగృహం నందు ఆదివారం విలేకర్లుతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవులు గ్రామం కొత్త హరిజనవాడ నందు ఎన్నో సంవత్సరాలుగా హరిజనులు సాగు చేసుకుంటున్న భూమిని దాని పక్కన ఉన్న భూమికి చెందిన వైసిపి కార్యకర్తలు హరిజనులు సాగు చేసుకుంటున్న భూమిలోకి చొరబడి వారిపై దౌర్జన్యం చేసి వారి తలలు పగులగొడితే టీడీపి ఇన్‌చార్జ్ రమేష్ రెడ్డి ఈ భూమి ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న హరిజనులకు చెంది నది అని ప్రజా ప్రతినిధిగా సర్దిచెబితే స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఇదే ఆసరా చేసుకుని పక్కన ఉన్న భూమిని వారిని ఉసిగొలిపి రమేష్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించడం ఎంతటి దుర్మార్గపు చర్యఅన్నది స్పష్టం అవుతోందన్నారు.కార్య క్రమంలో టీడీపి నాయకులు వాసుదేవరెడ్డి, నీలకంఠరెడ్డి, వెంకట్రామి రెడ్డి, రాజా, బాబు, అంజినేయులు రెడ్డి,మండల తెలుగుయువత అధ్యక్షుడు నాభూష ణ్‌రెడ్డి, చిన్నవీరనాగిరెడ్డి, మదనమోహన్, యువరాజ్, చాన్‌బాషా పాల్గొన్నారు.

**చిన్నమండెంలో...**



స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఇద్దరు మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డిని ఎదుర్కొనే దైర్యం లేక ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించడం నీతిమాలిన చర్య అని మండల టీడీపి అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. రమేష్‌రెడ్డిపై కేసులు ఎత్తివేయకపోతే పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్ర మం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**లక్కిరెడ్డిపల్లెలో...**



టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం సబబు కాదని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి మండల తెదేపా అధ్యక్షులు జయరాం, మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె రమేష్‌రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి తెదేపా ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి స్వర్గీయులు ఆర్.రాజగోపాల్‌రెడ్డి హయాంలో 60 సంవత్సరాల నుంచి ఇంత వరకు ఏ మచ్చ లేకుండా రాజకీయం చేశారని, ఎక్కడే కానీ భూ కబ్జాలకు పాల్పడిన చరిత్ర కానీ వారికి లేదన్నారు. కార్యక్రమంలో మద్దిరేవుల సర్పంచ్ చంద్రమ్మ, కేశవులు, అహల్య, రమణ, సురేంద్ర, చంద్రాయుడు, శంకర్, వాసుదేవుడు, నరసింహారెడ్డి, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో అవినీతిమయం

కేవి.పల్లె,నవంబరు 13ప్రభాతవార్తః



వైసీపీ పాలన అవినీతిమయం అని తెదేపా కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎం.వి.పల్లె పంచాయతీ అంగజాల వారిపల్లలలో జరిగిన ఓకార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ వైకాపా నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వారిని గట్టిగా ఎదుర్కో వాలని అన్నారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో తెదేపా విజయమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. తెదేపా కార్యకర్తలకు అండగా ఉంటానని భయపడాల్సి న అవసరం లేదని తెలిపారు. ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలోకి వైకాపా అవినీతి పాలన దౌర్జన్యాల గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు శివారెడ్డి, బాబు, విశ్వనాధ రెడ్డెప్పరెడ్డి, రవిచంద్రారెడ్డి ద్వారక పాల్గొన్నారు.

# విచారణలో ఆరోపణలు చేయడం తగదు

కడప కార్పొరేషన్, నవంబరు 13, ప్రభాతవార్త:



మా వ్యాపార కార్యకలాపాలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని భావన టౌన్‌షిప్, బుద్ద టౌన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు పార్టనర్లు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, గుమ్మా నాగిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా కడప నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. భావన టౌన్‌షిప్, బుద్ద ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు సంబంధించి తాము వ్యాపారాలు కొనసాగిస్తున్నాము. మా సంస్థకు సంబంధించి అన్ని చట్టపరమైన అనుమతులతో, నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్డర్ చేయబడిన భూములను మాత్రమే తాము కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. కొంత మంది అవాస్తవాలను ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.ఏవైనా అనుమానాలుంటే కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలను కలిసి తెలుసుకోవాలన్నారు.సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, ఖదీర్ పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

రామసముద్రం, నవంబర్ 13 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయితీ మట్లావారి పల్లెలో అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. ఈ పడిపూజా కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డప్ప పాల్గొన్నారు. రెడ్డప్ప ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి ఈ కార్యక్రమానికి విచ్చేసిన అయ్యపస్వామి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ప్రతిరోజూ అయ్యప్పస్వామి మాలదారణ వేసిన వారు అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భజనలు నిర్వహించేవారు. ఈ కార్యక్రమంలో భక్తులు రెడ్డప్ప, అయ్యప్ప, హరి, పాండరంగాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రైత భరోసా కేంద్రంల ఈ క్రాప్ బుకింగ్

రామసముద్రం, నవంబర్ 13 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని రైతులు ప్రతి ఒక్కరూ రైతుబరోసా కేంద్రంలో ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు వల్ల ప్రతి రైతుకు మేలు కలుగుతుందని తెలిపారు. ఆర్‌బికేలో రైతులకు పరికరాలు, ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తీసుకోవాలని కోరారు.

# సీనియర్ టిడిపి నేతకు కిషోర్‌కుమార్‌రెడ్డి పరామర్శ

కలికిరి నవంబర్ 13 ప్రభాతవార్త :



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయితీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అయిన ఎంఆర్. భద్రయ్యను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారికిషోర్‌కుమార్‌రెడి పరామర్శించారు. ఎంఆర్ భద్రయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఇటీవల ఇంటికి వచ్చాడు. సమాచారం తెలుసుకొన్న కిషోర్‌కుమార్‌రెడ్డి టిడిపి సీనియర్ నేత ఇంటికి వెళ్ళి పరామర్శించారు.కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుల వాసునూరి చంద్రశేఖర్, టిడిపి నాయకులు వెంకటపతి, విజయ్, చిన్నరెడ్డయ్య పాల్గొన్నారు.

# కనసానివారిపల్లెలో గడప గడపకు కార్యక్రమం

కురబలకోట, నవంబర్ 13 ప్రభాతవార్త :



మండలంలోని కనసాని వారిపల్లె, కనసానివారిపల్లె దళితవాడకాలనీ, గుణకుంట వారిపల్లె పల్లెల్లో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాసమస్యలను ఆయన ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సచివాలయ సిబ్బంది పరిష్కరించాలని కోరారు. అందుకు అవసరమయ్యే నిధులను మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దస్తగిరిసాబ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఆర్‌కె.క్రిష్ణారెడ్డి, సర్పంచ్ తెట్టుమనోహర్‌రెడ్డి, ఆలయ ఛైర్మెన్ జగన్‌రెడ్డి, ఆర్‌బికే ఛైర్మెన్‌శివశంకర్‌రెడ్డి, ఎంపిటిసి గోపాల్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్, వెంకటరమణారెడ్డి, సురేంద్రనాథ్, అధికారులు దిలీప్‌కుమార్, అబ్దుల్‌సుకూర్, చంద్రకళ, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 17బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు క్రీడాకారులు ఎంపిక

వాల్మీకిపురం,నవంబర్ 13: ప్రభాతవార్త



అండర్ 17 బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరిగింది.స్థానిక పివిసి స్కూల్ మైదానంలో నిర్వహించారు.జిల్లాలోని మొత్తం 65 మండలాల బాలబాలికల క్రీడాకారులు పాల్గొన్నారు.అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక చేశారు.బాలుర జట్టుకు టి.ప్రవీణ,ఎస్.కృష్ణ కౌసిక్,ఆర్.వరుణ్ తేజ్,ఎస్.వాసీమ్ అక్రమ్,డి.దివాకర్, టి.అరవింద్, ఎస్.జబీవుల్లా (వాల్మీకిపురం), సి.కె.హేమ చరణ్, బి.చేతన్ (చిత్తూరు), ఎం.అఫాన్,ఎస్.రెడ్డి శ్రీకర్,కె.చరణ్ తేజ్(మదనపల్లి),స్టాండ్ బాయ్స్ డి.బానుతేజ్, కె,నందనీష్ రెడ్డి,ఎస్.హారూన్ (మదనపల్లి)క్రీడాకరారులు ఎంపిక య్యారు. బాలికల జట్టుకు టి.రెడ్డి గాయత్రి,ఎం.మమత(వాల్మీకిపురం),ఎం.హర్షిణి చౌదరీ,కె.గీతిక సాగర్,సి.తనూశ్రీ(చిత్తూరు),వై.రూపా రెడ్డి, ఎం.సుప్రియ, జి.సిందూ (మదనపల్లి),బి.అంజలి,సి.తనూజా,ఎన్.పూజిత (జడ్‌పిహెచ్ఎస్, తరిగొండ), వై.శాలిని (ఈడిగ పల్లి)స్టాండ్ బాయ్స్‌గా ప్రియాంక,అమ్రుతా (మదనపల్లి) క్రీడాకారులను ఎంపిక చేశారు.వీరు జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు.సెలక్షన్ కమిటి సభ్యులుగా వి.నాగరాజ,జయ క్రిస్టి,మునుస్వామి, సుబ్రమణ్యం,మాదవయ్య,పిఈటిలు రాము,రమేష్,గోపి,రెడ్డిప్రసాద్ తదితర అధ్యాపకులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

# సూర్యప్రకాష్‌ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

కేవి.పల్లె, నవంబరు 13 ప్రభాతవార్తః



మండలంలోని గ్యారం పల్లె కొత్తపల్లెలో సూర్యప్ర కాష్ ట్రస్టు ఆధ్వర్యంలో మిన్నంరెడ్డి వెంకటరమణా రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచితవైద్యశిబిరంలో 70 మంది రోగులకు ఉచితంగా వైద్యులు కుప్పుస్వామి పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో సర్పంచి రెడ్డెప్ప, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, పీలేరు ఎంపీటీసీ నరసింహారెడ్డి, బాల కృష్ణారెడ్డి, సునందకుమారి తదితరులు పాల్గొన్నారు.

# 10 లీటర్ల నాటుసారా స్వాధీనం- ఒకరు అరెస్టు

కేవి.పల్లె, నవంబరు 13 ప్రభాతవార్తః



మండలంలోని వడ్డకుంట గ్రా మంలో దాడులు నిర్వహించగా కళా వతి వద్ద 10 లీటర్ల నాటుసారా కలిగి ఉండగా ఆమెను అరెస్టుచేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఈబీ ఎస్సై లక్ష్మీనరసయ్య సిబ్బంది, ఏఎస్పీ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ హక్కుల పోరాట సమితి నూతన కమిటీల నియామకం

మదనపల్లె, నవంబర్ 13 ప్రభాతవార్త :




బిసిల ఐక్యత అభ్యున్నతికి బిసి హక్కుల పోరాట సమితి ని రంతరం కృషి చేస్తుందని బిసి హక్కుల పోరాట సమితి (బిసి హెచ్‌పిఎస్) వ్యవస్థాపకులు బో డెం రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ వేదికగా బిసి హక్కుల పోరాట సమితి నూతన కమిటీ సభ్యులకు నియమక పత్రాలు అందించా రు. ఈ సందర్భంగా నిమ్మనపల్లె మండల బిసిహెచ్‌పిఎస్ అధ్యక్షులుగా పారేసు రాజగోపాల్ ను నియమించారు. నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండల అధ్యక్షులుగా పారేసు రాజగోపాల్ నియమిం చడం జరిగిందన్నారు. రాయలసీమ యూత్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మణిశం కర్, అన్నమయ్య జిల్లా గౌరవ అధ్యక్షులుగా పోతబోలు వెంకటరమణ, మదనపల్లె డివిజన్ గౌరవ అధ్యక్షులుగా గజ్జెల గంగాధర్, తాలూకా గౌరవ అధ్యక్షులుగా సుధాకర్, మదనపల్లె డివిజన్ ఉపాధ్యక్షులుగా గురుమూర్తి లను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న బిసి హక్కుల పోరాట సమితి గ్రామా స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి నూతన నియమకాలను చేపట్టడం జరిగిందని వివరించారు. ఈనెల 20 వ తేది నిమ్మనపల్లె మండలంలో బిసి హక్కుల పోరాట సమితి ఆత్మీయ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ప్రతిఒక్కరూ హజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ సలహాదారు హరినాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగినేని గోవిందు, కార్యనిర్వాహక కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్, అన్నమయ్య జిల్లా కార్యదర్శి బండి రామచంద్ర, అన్నమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి బొమ్మనపల్లి లక్షుమన్న, నాయకులు రెడ్డి భాస్కర్, రమణ పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా రంగు రాజేంద్ర



మదనపల్లె, నవంబర్ 13 ప్రభాతవార్త :

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ ఏపీ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా రంగు రాజేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లి కు చెందిన సీనియర్ డాక్యుమెంట్ రైటర్ రంగు రాజేంద్ర.. హ్యూమన్ రైట్స్ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. ఇందులో భాగంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా, కోఆర్డినేటర్‌గా, రాయలసీమ అధ్యక్షునిగా రెండుసార్లు ఎంపికయ్యారు. తాజాగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టులో ఏపీ రాష్ట్రస్థాయిలో పదవి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర, అక్రమాల నియంత్రణలో ప్రభుత్వ సహాయ సహకారాలు తీసుకుంటూ ముందుకెళ్తామన్నారు.

# నేడు తెట్టు, ఎర్రబల్లిగ్రామాల్లో గడప గడపకు కార్యక్రమం

కురబలకోట, నవంబర్ 13 ప్రభాతవార్త :

కురబలకోట మండలంలో సోమవారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్ తెలిపారు. తెట్టు, ఎర్రబల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపిడిఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

# వంగ దిగుబడి ఆశాజనకం

- ధరలు లేక దిగాలు చెందుతున్న రైతన్న
- పురుగుపట్టి దిగుబడి తగ్గింది - అప్పుల్లో కూరుకుపోయిన రైతాంగం

రామసముద్రం, నవంబర్ 13 ప్రభాతవార్త :



ప్రకృతిని నమ్ముకొని భూమిపై ఆధారపడి ఒక పంట పోతే మరో పంట వస్తుందన్న ఆశతో వంగ పంట వేసి దిగుబడి బాగా వచ్చినా.. పంటకు గిట్టుబాటు ధర లేదు.. చేసిన అప్పులు తీర్చలేక అప్పులు పాలైన రైతన్నలు..ఇలా పడమటి రైతన్నలు పంటలపై జీవనం సాగిస్తోంది. తాను జీవనం కొనసాగిస్తు వ్యవసాయ కూలీలకు ఉపాధికల్పిస్తున్నారు. ఇటీవల వంగతోటకు పురుగు పడి రైతుకు పంట దిగుబడి కూడా రావడంలేదని వాపోయారు. రైతులు ఖరీప్ సీజన్‌లో పంటదిగుబడి రాకున్నా రబీసీజన్‌లో పంటరాక పోతుందా అనే ఆశతో కష్టమొచ్చినా వంగతోటను ధైర్యంతో పట్టువదలని బట్టివిక్రమార్కుడిలా జీవనయానం సాగిస్తున్న రైతాంగానికి వ్యవసాయం ఆశలజూదంగా మారింది. ఇటీవల సాగుచేసిన వంగతోట సాగు ఆశాజనకంగా దిగుబడి వచ్చింది. గిట్టుబాటుధర లేనందున రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం లేకుండా పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమై పోతున్నామని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వంకాయపంట అయినా లాభం చూకూర్చుతుందనుకొన్న దిగుబడులు బాగా వచ్చినా ధరలు మాత్రం పెరగలేదు. వంకాయతోట సాగు చేసేందుకు ఒక ఎకరాకు రూ.25వేల నుంచి 30వేల వరకు పెట్టుబడి ఖర్చు పెట్టారు. కౌలు రైతులు అయితే మరికాస్త పెట్టుబడి పెట్టాలి. ఎకరాకు దిగుబడి 15నుంచి 25క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. ధరమాత్రం కిలో రెండు నెలల క్రితం రూ.50నుంచ 60ల వరకు పలికేది. ఇప్పుడు అదే వంకాయలు కిలో రూ.15నుంచి 20ల వరకు ధర పలుకుతోంది. ఏది ఏమైనా ఈ ఏడాది పంట బాగా వచ్చినా ధరలు మాత్రం పెరగలేదని చెప్పాలి.

# రేపు ఉపాధి హామీపై ప్రజా వేదిక

తంబళ్లపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో 19 పంచాయతీలలో 1.4.2020 నుంచి 31.3.2022 వరకు జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సర్వే పూర్తయి 15వ తేదీన ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆనంద్‌కుమార్, ఏపీవో మాధవి విలేకరులకు తెలిపారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ఉపాధి హామీ కూలీలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్షంలో పంచాయతీ వారీగా చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రజావేదిక కార్యక్రమానికి డీఆర్డీఏ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజా ప్రతినిదులు, ఉపాధి కూలీలు తప్పక హాజరుకావాలని ఏపీవో మాధవి కోరారు.

# వార్షికోత్సవం సందర్బంగా భక్తి గీతాలు ఆలాపన

వాల్మీకిపురం, నవంబరు 13 ప్రభాతవార్తః

వాల్మీకిపురం పట్టణ పొలిమేరల్లోని సమూహ దేవాలయం శ్రీకార్యసిద్ది అభయాంజనేయస్వామి వార్షికోత్స వం సందర్భంగా 108 భక్తి గీతాల స్వరాల ఆలాపన కార్యకమ్రం ఉండుటందని ధర్మకర్త పేర్కొన్నారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో దేవాలయ వార్షికోత్స వం జరుగుతుందని పేర్కొన్నారు. 26వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 108 భక్తిగీతాల స్వరలహరి కార్యకమ్రం సాగుతుంది. ఈకార్యక్రమంలో ఉత్సా వహులైన గాయనీ గాయకులు ముందుగా రిజిస్టర్ చేసుకోవచ్చు. పలు వివరాలకు 9618489171 సంప్రదించవచ్చు. అదేవిధంగా శ్రీ వల్లీ సుబ్రమణ్యంస్వామి లింగోద్భవ మహాశివుడు, ఆంజినేయస్వామి విగ్రహాలకు పెద్ద ఎత్తున పూజా కార్యకమ్రం జరుగుతుందని పేర్కొన్నారు.

# రాజంపేటలో ఈనెల 16న అయ్యప్ప మండల పడిపూజ మహోత్సవం

రాజంపేట అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త



శబరిమలలో ఈనెల 16న మండల పూజకు ఆలయ తలుపులు తెరుచుకోనున్న నేపథ్యంలో రాజంపేటలో కూడ మండల పూజ మహోత్సవానికి రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు జాతీయ రహదారిలో భువనగిరిపల్లె ముఖద్వారం సమీపంలో వెలసిన అయ్యప్ప ఆలయంలో 16వ తేది మండల పూజ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను వారు ఆవిష్కరించారు. 16వ తేది సాయంత్రం ఆలయంలో పడిపూజ మహోత్సవం జరుగుతుందని ఆలయ ఛైర్మన్ పాల ప్రకాష్, గురుస్వామి సత్యనారాయణలు తెలిపారు. పడిపూజలో భాగంగా పవిత్ర పదునెట్టాంబడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు భజన కూడ ఉంటుందని వారు పేర్కొన్నారు. అంతేగాకుండా ఈనెల 26న అయ్యప్ప గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. పడిపూజకు, గ్రామోత్సవానికి అయ్యప్ప భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఆలయ కమిటి సభ్యులు దామోదర్ ఆచారి, ఆదినారాయణ, గురుస్వాములు ఐసి వెంకటరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. గత 15 రోజులుగా ప్రతిరోజు ఆలయంలో రాత్రివేళ అయ్యప్ప భజనలు, అనంతరం బిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ సభలను విజయవంతం చేయాలి

రాజంపేట అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త

ఈనెల 26, 27, 28న రాజమండ్రిలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి జిల్లాల సహాయ కార్యదర్శి గాలి చంద్ర కోరారు. ఆదివారం ఆర్ అండ్ బి బంగ్లా వద్ద జాతీయ మహాసభల గోడపత్రాలను సంఘం నాయకులు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు నేడు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాన్ని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కాటంశెట్టి వెంకటయ్య, ఎఐటియుసి ఏరియా కార్యదర్శి ఎంఎస్ రాయుడు, మేస్త్రిలు నన్నెసాహెబ్, మల్లికార్జున, నాగభూషణం, రాజు, రమణ, రంగస్వామి, బాలు నాయక్ పాల్గొన్నారు.

# పిడుగు పాటుతో ఉలిక్కిపడ్డ గ్రామం

**ఆస్తి నష్టం మినహా తప్పిన ప్రాణ నష్టం**

చిట్వేలి, నవంబరు 13 ప్రభాతవార్త



చిట్వేలి మండల పరిధిలోని నగిరిపాడు పంచాయతి మల్లెంపల్లె గ్రామంలో పిడుగుపాటుతో లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. గ్రామ రెవెన్యూ అధికారి మదినేని భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం కస్తూరి నారయ్య కుమారుడు వెంకటయ్య ఇంటి వంట గదిలో పిడుగు పడటంతో విద్యుత్తు సామగ్రి ఫ్రిజ్, ఎసి, ఇన్వర్టర్, గీజర్ సంబంధిత వస్తువులు, వంటగది గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. సుమారు 3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు వరండాలో ఉండడంతో ప్రాణ నష్టం తప్పిందని అన్నారు. పిడుగుపాటుతో భారీ శబ్ధం రావడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జనాలు పరుగులు తీశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

# జడ్పీటీసీని సన్మానించిన సివిల్ సప్లైస్ డైరెక్టరు

వేంపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త :



వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డిని రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టరు షబ్బీర్‌వలి ఘనంగా సత్కరించారు. ఆదివారం రవికుమార్‌రెడ్డి ఇంటికి షబ్బీర్‌వలితో పాటు మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ సాదక్‌వలి కలిసి వెళ్లి అభినందనలు తెలిపారు. దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రవికుమార్‌రెడ్డి మరెన్నో ఉన్నత పదవులు పొందాలని, మండలాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ యువ నాయకులు ఎస్.డి.సమీర్, మదార్‌షావలి, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల కార్తీక వనభోనాలు

పులివెందుల రూరల్, నవంబరు 13, ప్రభాతవార్త :



పులివెందులలో 1991-92 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కార్తీక వనభోజనాలు కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రామనాథ మాట్లాడుతూ కార్తీక మాసంలో వనభోజనాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుదని, ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనభోజనాలు చాటి చెబుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలోపూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల రూరల్, నవంబరు 13, ప్రభాతవార్త :



పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఆటవిదుపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్.కె.డ్యాన్స్ స్టూడియో మాస్టర్ శార్వన్, చిట్టి శిష్య బృందంచే జానపదం, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు శర్వన్, చిట్టి, పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# వాస్తవాలు తెలుసుకుంటేనే మనుగడ

పులివెందుల, నవంబరు 13, ప్రభాతవార్త :



జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వాస్తవాలు తెలుసుకుంటేనే ప్రజల్లో మనుగడ ఉంటుందన్న విషయాన్ని తెలుసుకోవాలని పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ వరప్రసాద్, సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డిలు అన్నారు. పులివెందులలో వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 31లక్షల ఇళ్ల స్థలాలను ప్రజలకు పంపిణీ చేసి ప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనత సాధించారని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా పవన్‌కల్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. త్వరలో మరో 9లక్షల ఇళ్లను కూడా విడతల వారిగా ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉండటం వల్ల జాప్యం జరిగిందే తప్ప మరొకటి లేదన్నారు. కేవలం చంద్రబాబు అధికారంలోకి రావాలంటే వ్యతిరేక ఓటు చీలకూడదని ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ ప్రజల అభిమానం, ఆశీస్సులు ఈ ప్రభుత్వానికి ఉన్నాయన్నారు. సామాజిక స్పృహ కలిగిన వారు పవన్ కల్యాణ్ టీడీపీ నాటకాలను గ్రహించి వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మహమ్మద్ హఫీజ్, వాల్మీకి సంఘ నాయకులు అంబకపల్లె నారాయణస్వామి, నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు ఓతూరు రసూల్, బలిజ సంఘం నాయకులు సోఫాల వీరా, కౌన్సిలరు కిషోర్, వైకాపా నాయకులు సంపత్, సిద్దయ్య, ఎస్సీ నాయకులు కృష్ణమూర్తి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

# దొమ్మరుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

రాయచోటి.నవంబర్ 13 ప్రభాతవార్త



దొమ్మరుల సంక్షేమానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటిలోని వాసవి కళ్యాణమండంలో దొమ్మర కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిధిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. అర్హతే ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తోందన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు తగ్గట్లుగా తమ జీవన విధానాలను అభివృద్ధి పరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా దొమ్మర సంఘం నాయకులు తమ సమస్యలపై శ్రీకాంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. దొమ్మర సంఘం నాయకులు ఆద్వర్యంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి దుశ్శాలువులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పోలుసుబ్బారెడ్డి, మండల బీసి నాయకుడు పల్లపురమేష్, దొమ్మర సంఘం నాయకులు గోపాల్, శివశంకర్, శేఖర్, రాయదుర్గం హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చౌడమ్మదేవిని దర్శించుకున్న భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 13, ప్రభాతవార్త:



జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామంలో జ్యోతుల మహోత్సవం సందర్భంగా చౌడమ్మదేవికి ప్రత్యేక పూజలను తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ధనుంజయ, తేజ, లక్ష్మీనారాయణ, రఫీ, బడ బచ్చ, దాదాపీర్, తరుణ్, భాస్కర్, రాజు, ఫరాజ్, నాగేంద్ర, రాజా, మా భాషా, దస్తగిరి, అనీఫ్, సుభహాన్, శివ, సుబ్బయ్య, తెదేపా నాయకులు, కార్యకర్తలు, మోరగుడి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంత గ్రంథం బహూకరణ

జమ్మలమడుగు, నవంబరు 13, ప్రభాతవార్త:



త్రైత సిద్ధాంతం ప్రబోదానంద స్వామి శిష్యులు ప్రముఖ వైద్య నిపుణుడు డా.మార్తల ప్రదీప్‌రెడ్డికి త్రైత సిద్ధాంత గ్రంథం బహూకరణ ప్రముఖ వైద్య నిపుణుడు డా.ఎంపీ మునిరెడ్డి మనువడు ప్రముఖ ఎంఎస్ ఆర్తో ఎముకల వైద్య నిపుణుడు డా.మార్తల ప్రదీప్‌రెడ్డి, జమ్మలమడుగులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నప్పుడు ఆయనకు మరియు ఆయన సన్నిహితులకు త్రైత సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయం గ్రంథం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక జమ్మలమడుగు శాఖ వారు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సమాజానికి త్రైత సిద్ధాంత గ్రంథం మార్గదర్శకత్వాన్ని ఇస్తామని భగవద్గీత, బైబిల్, ఖురాన్ గ్రంథములు చదివితే మత సామరస్యం ఏర్పడుతుందని తెలిపారు.

# సత్యాలను అసత్య ప్రచారాలుగా మారుస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

వేంపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త :



నాలుగురోజుల క్రితం ఎమ్మెల్సీ బీటెక్ రవి సామాజిక న్యాయాలపై మాట్లాడితే.. అవి నిజాలు కాదు అని వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు రామచంద్ర, శ్రీను, మల్లికార్జున, యుగందర్, దేవేంద్రలు అన్నారు. ఆదివారం వేంపల్లెలో వారు సమావేశంలో మాట్లాడారు. వేంపల్లె ఎస్టీ మహిళలకు సర్పంచి రిజర్వేషన్ రాగా సర్పంచిగా నామినేషన్ వేసిన దాసరి రమాదేవి సంతకాన్ని ఫోర్జరీ చేసిన విషయాన్ని ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆనాడే నిరూపించారన్నారు. ఈ విషయమై హైకోర్టులో పిల్ వేయగా ఇప్పటికీ విచారణ సాగుతోందన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి రిపోర్టు రాకముందే ఫోర్జరీ సంతకం కాదని ఎలా నిరూపిస్తారని వారు ప్రశ్నించారు. ప్రస్తుత మాజీ సర్పంచి జలకం వెంకట లక్షుమ్మ అనారోగ్యంతో బాధపడుతూ రాజీనామా చేశారనడం కూడా అవాస్తవమే అన్నారు.

# గ్రంధాలయ వారోత్సవాల పోస్టర్లును విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే

రామాపురం.నవంబర్ 13 ప్రభాతవార్త



గ్రంధాలయ వారోత్సవాల పోస్టర్లును మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ అధికారి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రంధాలయ వారోత్సవాలు సోమవార నుంచి ప్రారంభమయ్యి వారం రోజులు పాటు ఆదివారంతో ముగియనున్నాయి. సోమవారం చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం, 15వ తేదీన పుస్తక ప్రదర్శన, 16న గ్రంధాలయ ఉద్యమ నాయకులన స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, 18న వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు, 19న దిశ చట్టం పై అవగాహన, 20వ తేదీన పోటీలు యందు గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవం చేయడం జరుతుందన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# 16న రైతు సదస్సు

దువ్వూరు, నవంబరు 13, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరు రోడ్డులోని కల్యాణ మండపంలో ఈనెల 16వ తేదీ కడప రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం సాంకేతిక పరిజ్ఞానంతో రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యుడు రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వీరయ్య, మురళీకృష్ణ, శ్రీవల్లీ పాల్గొని పంటల సాగులో యాజమాన్య పద్ధతుల గురించి తెలుపుతారన్నారు. వరి, మొక్కజొన్న, జొన్న, వేరుసెనగ, పసుపు పంటల సాగులో పాటించాల్సిన మెళకువలు, సస్యరక్షణ పద్ధతులు, యాజమాన్యపద్ధతుల గురించి వివరిస్తారని 16న జరిగే ఈ సదస్సును వినియోగించుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

# యువకుడు ఆత్మహత్య



కడప క్రైం, నవంబరు 13, ప్రభాతవార్త:

కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ప్రకాష్‌నగర్‌కు చెందిన కడుగు ఆనంద్(27) అనే యువకుడు ఈనెల 12న సాయంత్రం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై మృతుడి తండ్రి రిటైర్డ్ ఉద్యోగి కడుగు ఏసురత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నచౌకు ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి 3 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. ఆనంద్‌కు అప్పుడప్పుడు కడుపునొప్పి వస్తూ ఉండేది. మద్యం సేవించే అలవాటు కూడా ఉంది. తనకు ఉద్యోగం లేదనీ, తనకు భవిష్యత్తులో పుట్టబోయే బిడ్డను ఎలా పోషించాలో తెలియన తీవ్ర మనస్తాపానాకి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు, తల్లిదండ్రులకు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# ద్విచక్ర వాహనాలు ఢీ - ఇరువురికి గాయాలు

బద్వేలు అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త :



పట్టణంలోని సిద్దవటం రోడ్ చర్చీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఆ రహదారిలో వెళుతున్న రూరల్ సీఐ హనుమంత్ నాయక్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇరువురిని వెంటనే 108 వాహనం ద్వారా సీమాంక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత రెండు రోజులుగా జ్యోతిరావ్ పూలే కూడలి వద్ద కల్వర్టు మరమ్మత్తులు చేపట్టడంతో వాహనాలన్నీ ఒకే దారిలో మళ్ళించడం ద్వారా వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.

# కార్తీక మాసం ప్రీతికర మాసం

బద్వేలు అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త :



కార్తీక మాసం ప్రీతికర మాసం కావున ఆదివారం తెల్లవారుజాము నుండే పలువురు భక్తులు శివాలయాల వద్ద ఉన్న నాగుల వద్ద పలువురు మహిళలు కార్తీక దీపాలు వెలిగించి చలిపిండి, సొద్దలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే సిద్దవటం రోడ్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీ సత్య ప్రసాద్ దంత వైద్యశాల వైద్యులు డా॥ సత్య ప్రసాద్, సతీమణి హరిత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వీరేశాచార్యులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# మంగంపేటలో సీఎంఎస్ఆర్ కమిటీ ద్వారా ఇళ్ల సర్వేలు

ఓబులవారిపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త:

మంగంపేట ఏపీఎండీసీ పరిధిలో ఉన్న కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతీ వాడ గ్రామాలకు చెందిన ఇళ్లు, భూములు వాటి వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల ద్వారా వారి వారి ఇళ్లను గుర్తించి కమిటీకి నివేదికలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీఎండీసీ వారు నియమించిన కమిటీ అధికారులకు గత 3రోజులుగా గ్రామస్థులు వారి వద్ద ఉన్న ఆధారాలకు సంబంధించి ఇళ్ల నమూనా, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, కుటుంబ సభ్యుల విద్యార్హతల పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా వర్తిస్తున్న అర్హులందరికీ ఏపీఎండీసీ సంస్థ ద్వారా అందాల్సిన పరిహారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎంఎస్ఆర్ కమిటీ తెలిపింది.

# మెగా ఉచిత వైద్య శిబిరం

కడప కార్పొరేషన్, నవంబరు 13, ప్రభాతవార్త:



పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వెనకబడిన ప్రాంతమైన పాలెంపల్లెలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పేదలకు వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు వారికి కావాల్సిన మందులు సుమారు రూ.4లక్షలు విలువ చేసేవి డాక్టర్లు ఉచితంగా అందించారని తెలిపారు. ఈ సందర్భంగా గుంటి నాగేంద్ర మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి సేవలందించేందుకు వచ్చిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రతి నెల పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కరోనా బారిన పడి ఇబ్బందులు పడ్డ వారికి డైమండ్ మైక్రో మినరల్స్ అధినేత హరీష్, డా.సురేంద్రబాబులు ముందుకొచ్చి సహకరిస్తామని వైద్యం ఇచ్చారని తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ మెగా వైద్య శిబిరంలో వైద్యులు సురేంద్రబాబు, సుష్మ, భరత్‌కుమార్‌రెడ్డి, నవీన్ ప్రసాద్, శ్వేతా రెడ్డి, శివప్రసాద్, శ్రావణ్‌కుమార్, జాకీర్ హుసేన్, జయభారత్‌రెడ్డి, స్నేహితులు పాలెంపల్లె వెంకటరమన; శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అన్నదానం పుణ్య కార్యక్రమం

బద్వేలు అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త :



అన్ని దానాలలో కన్నా అన్నదానం పుణ్య కార్యం అని గుర్రంపాటి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంపాటి శ్రీనివాసులురెడ్డి, సతీమణి సుభద్రల వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు గంగ కాలనీలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహంలో ఉన్న అనాథ వృద్ధులకు రుచికరమైన భోజనం, పండ్లు, తినుబండారాలను వారి చేతుల మీదుగా వితరణ చేశారు. అనంతరం గుర్రంపాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆసరా కోల్పోయిన అనాథ వృద్ధులకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి సహాయ సహకారాలు అందించడం ద్వారా వారిలో అనాథ అనే భావన కోల్పోయి సంతోషంగా ఉంటారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచిన ప్రధాని మోదీ

**- ప్రాంతీయ పార్టీలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలు**

**- కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం**

వేంపల్లె, నవంబరు 13, ప్రభాతవార్త :



ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన ప్రలను నిరాశ పరిచిందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పుల్లన్న పులివెందుల సంతకు పోనూపోయాడు.. రానూ వచ్చాడు వట్టి చేతులతో అన్నట్లు నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు రానూ వచ్చాడు - పోనూపోయాడు ఏమీ ఇవ్వకుండా అన్నట్లు సాగిందన్నారు. విభజన హామీలపై ప్రస్తావన చేయలేదని ప్రధాని మోదీపై మండిపడ్డారు. శూన్యహస్తాలు, పొగడ్తలతోనే సరిపెట్టారన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకారెడ్డిగా నిరూపించుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. నేను అడిగినట్లు నటిస్తా.. మీరు విన్నట్లు నటించండి అని ప్రధానికి జగన్ ముందుగానే మొరపెట్టుకున్నట్లు ఉందని తెలిపారు. తమ బంధం రాజకీయాలుక అతీతమని చెప్పడం, వ్యక్తిగత కేసుల నుండి బయట పడేయమని వేడుకుంటున్నట్లుందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. ప్రత్యేకహోదా విభజన అంశాల అమలు కావాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారికంలోకి రావాల్సిన చారిత్రక ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలిపారు.

# గుండాలకోన కర్కాటేశ్వరుని చూతము రారండి

**- వెంద్రకాయ రూపంలో భక్తులకు ప్రత్యేక దర్శనం - కార్తీమాసంలో తప్పక దర్శించుకోవాల్సిన శైవక్షేత్రం**

చిట్వేలి, నవంబరు 13 ప్రభాతవార్త







ఎటు చూసినా జలం... ఆకాశం కుండపోతగా వర్షిస్తోంది. చుట్టూ జీవం నింపుకుని ఆకుపచ్చగా కళ కళలు ఆడుతున్న భూమి. కుంభవృష్టిలో తడిసి ముద్దవుతున్న నేలని చూస్తుంటే ఆ నేల అసాంతం ఒక పెద్ద శివలింగం లాగా, ఆకాశం పూజారిగా మారి నిండుగా అభిషేకం చేస్తున్నట్టుగా ఉంటుంది. అదియే గుండాలకోన పుణ్యక్షేత్రం.

**కనువిందు చేసే ప్రకృతి అందాలు ః**

చుట్టూ పచ్చికబయళ్లు.. ఆపై జల జలపారే సెలయేళ్లు... అన్నమయ్య జిల్లాలోని గుండాలకోనలో... కొత్రాల గుండాలు, చెంచమ్మకోన, వానసీళ్లగుట్టలు, మలిట్లకోన, పెద్దకంజులు, చిన్న కంజులు, మంతతువ్వ బండలు, జాలకోన, యానాది ఊట్ల, దొంగబండలు, ఊరగాయకుంట, కమ్మపెంట, కుందేలపెంట, ఈతకాయ బండలు, కోటమారుకుంట, ఏనుగులబావి, స్వామివారి పాదాలు (ఆ పాదాలు కొలిచే వీలులేని ఎత్తులో అద్భుతంగా ఉంటాయి) కోతుల కుప్ప, నెప్పెడిసెల, కందిరేవులు,మట్లకోన, సలీంద్రకోన తదితర ప్రాంతాలు ప్రకృతి అందాలకు చిరునామాగా వెలుగొందుతుంటాయి. గుండాలకోనలో జలపాతం,ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది.

**కోన చేరుకునేందుకు మార్గాలుః**

హరహర మహాదేవ శంభోశంకర, ఓం నమఃశ్శివాయ అంటూ శివనామస్మరణతో కర్కాటేశ్వర రూపంలో దర్శనమిచ్చే కర్కాటేశ్వరుడు ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాలోని చిట్వేలి మండలంలోని వెంకట్రాజుపల్లెపల్లె, పెద్దూరు, అనుంపల్లె గ్రామాల నుంచి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో రిజర్వు ఫారెస్ట్‌లో కొండ కోనల నడుమ దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ గుండాలకోన ఉన్నది. ఇటీవల ఆలయ కమిటి సభ్యులు, దాతల సాయంతో పెద్దూరు నుంచి కాలినడక మార్గాన్ని మట్టిరోడ్డు మార్గంగా భక్తులకు అణువుగా రూపొందించారు. వెంకటగిరి కొండలమీదుగా 6 గుండాలను దాటుకుని 7వ గుండంలోనికి సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తున్నది. గుండాలకోనలో వర్షాకాలంలో అతి ఉధృతంగాను, వేసవికాలంలో కూడ బాగానే నీరు ప్రవహిస్తుంది. ఇక్కడ ఉన్న గుండం లోతు చూసినవారు లేరని స్థానికుల కథనం.

**భక్తుల కొంగుబంగారం గుండాలకోనః**

కార్తీక మాసంలోనూ, శివరాత్రి పర్వదినాల్లోను భక్తులు ఈ క్షేత్రాన్ని విశేషంగా దర్శిస్తారు. విశ్వామిత్రుడు ప్రతిష్టించిన గుండాలేశ్వరస్వామి ఆలయ ప్రాంతమే గుండాలకోనగా ప్రసిద్ధి చెందింది. ఈ గుండంలో మునిగితే సర్వపాపాలు తొలగిపోతాయని, దెయ్యాలు వదులుతాయని, సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇక్కడ గుండం పక్కనే గుహ(పేటు) ఉంటుంది. ఈ గుహలో గుండాలేశ్వరుడు ఎండ్రకాయ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. గుహ ద్వారంలో భక్తులు పూజలు, ఫలాలు ఉంచుతారు. వాటిని ఎండ్రకాయ లోనికి తీసుకుపోతే తమ కోర్కెలు నెరవేరినట్లుగా భక్తులు భావిస్తారు. సంతానం లేని స్త్రీలు గుండం సమీఃపలోని వృక్షాలకు మొక్కుబడిగా ఉయ్యాలు కడుతారు. ఎత్తైన కొండల మధ్యలో భీకర శబ్దం చేస్తూ నీటి ప్రవాహం , సెలయేళ్లు గలగలు ఆకాశాన్ని తాకినట్టుండే మహావృక్షాలు, పచ్చదనంతో ఈ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా ఉంటుంది.

**గుండాలకోన చారిత్రక ఆధారంః**

ప్రకృతి అందాలకు నెలవైన ఈ గుండాలకోన దాదాపు 300 సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములువారి మనుమరాలైన ఈశ్వరమ్మను వివాహం చేసుకోగోరి నిరాకరణకు గురైన రంగరాజు (నగిరిపాడు రంగనాయకుల స్వామి) కొంతకాలం ఈ గుండాలకోనలోనే తపస్సు చేశాడట. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమై ఎండ్రకాయ రూపంలో భక్తులకు దర్శనమిస్తానని చెప్పాడని చెబుతారు. అయితే స్వామిని దర్శించుకోవాలంటే ఎన్నో ప్రయాసాలకోర్చి భక్తులు 8 కిలోమీటర్లు నడవాల్సిందే. కాని దట్టమైన అడవుల్లో దారి తప్పి క్రూర జంతువులకు బలైన సంఘటనలు కొన్ని జరిగాయి. అందుకే అటవీ అధికారుల అనుమతి సహాయంతో ప్రయాణం సాగించటం మంచిదంటారు అధికారులు. శివరాత్రి పర్వదిన సందర్భంగా వందలాది మంది భక్తులు వివిధ వాహనాల్లో ప్రయాణించి స్వామివారిని దర్శిస్తారు. వారి కోసం స్వామి సేవకులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేస్తుంటారు. ఇన్ని అందాలను విశిష్టతలను సంతరించుకున్న గుండాలకోన కర్కాటేశ్వరుని మనం దర్శించి తరిద్దాం రారండి.